సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
శుక్రవారం, 15.05.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 203
పేజీలు: 08 వెల: రూ. 5


# బిహార్ ముఠా పనే!

కరీంనగర్ దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

02

- దోపిడీ వెనుక మాస్టర్ మైండ్ సుభోద్ సింగ్
- దోపిడీదారుల్లో ముగ్గురు అరెస్ట్
- 13 మంది నిందితుల గుర్తింపు
- నిందితుల నుంచి పిస్టల్స్, వెహికల్స్, భారీగా ఆభరణాలు, నగదు స్వాధీనం
- బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అదుపులోకి నిందితులు




## మరో 16 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్

భారత ఎన్నికల సంఘం ఆదేశాలు

02

- తెలంగాణ, ఏపీ సహా 14 రాష్ట్రాల్లో అమలు
- అధికారులకు కీలక కేంద్రం ఆదేశాలు



## కేరళ సీఎంగా వీడీ సతీశన్

చివరి నిమిషంలో మారిన సమీకరణాలు..

04

- వెనక్కి తగ్గిన కేసీ వేణుగోపాల్
- ఎట్టకేలకు ప్రకటించిన కాంగ్రెస్ అధిష్ఠానం



## మోడీ సర్కార్ ఫెయిల్యూర్

మోడీ హయాంలోనే 93 పేపర్లు లీక్

03

- ఆందోళనలో రెండు కోట్ల మంది విద్యార్థులు
- కేంద్రం తీరుపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం



చివరి గింజ వరకు

## ధాన్యం కొంటాం

రాష్ట్ర ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి




- చెట్ల చెన్నారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- కొనుగోళ్లలో జాప్యం లేకుండా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు
- ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా లారీల సంఖ్య పెంచాలి
- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..
- రైతు శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం

03


## నో వెహికల్ డే.. వర్క్ ఫ్రమ్ హోమ్

కేబినెట్ మీటింగ్ లో పొదుపు చర్యలపై సీఎం చంద్రబాబు ఫోకస్



- మంత్రులు, ఎమ్మెల్యేలు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాడాలి
- కాన్వాయ్‌ల తగ్గింపు నుంచి సోలార్ వినియోగం
- మోదీ సూచనలతో ఏపీలో 'మనదేశం-మన బాధ్యత' పేరుతో కొత్త మార్గదర్శకాలు

04



# కేటీఆర్‌కు షాక్

ఫార్ములా ఈ కేసులో ఏసీబీ కోర్టు సమన్లు

- జూలై 31న హాజరు కావాలని ఆదేశం!
- రూ.55 కోట్ల నిధుల మళ్లింపు ఆరోపణలు..
- కేటీఆర్‌తో పాటు అధికారులకు సమన్లు
- ఏసీబీ కోర్టు ఆదేశాలతో రాజకీయ కలకలం
- మౌఖిక ఆదేశాలతో నిధుల విడుదల?
- ఛార్జిషీట్‌లో సంచలన అంశాలు
- ఫార్ములా-ఈ కేసులో బీఆర్ఎస్‌కు షాక్..
- జూలై 31న కేటీఆర్ హాజరుపై ఉత్కంఠ
- కాంగ్రెస్ vs బీఆర్ఎస్.. ఫార్ములా-ఈ కేసుతో తెలంగాణ రాజకీయాల్లో హీట్
- కోర్టులో ఏం జరగబోతోంది?

**ముద్ర డెస్క్ :** తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఫార్ములా–ఈ రేసు నిధుల మళ్లింపు వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు షాక్ తగిలింది. ఈ కేసులో ఏసీబీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను స్వీకరించిన నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు, కేటీఆర్‌తో పాటు పలువురు అధికారులకు సమన్లు జారీ చేసింది. జూలై 31న వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని న్యాయస్థానం ఆదేశించడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది.

గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలనుకున్న ఫార్ములా–ఈ రేసు కోసం సుమారు రూ.55 కోట్ల ప్రజా ధనాన్ని నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థలకు బదిలీ చేశారనే ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేపట్టింది. ఈ దర్యాప్తులో భాగంగా అధికారులు సమర్పించిన సుమారు 250 పేజీల ఛార్జిషీట్‌ను పరిశీలించిన కోర్టు, ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు భావించి విచారణకు స్వీకరించింది.

ఈ కేసులో కేటీఆర్‌తో పాటు అప్పటి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్.ఎన్ రెడ్డి సహా మరో ఇద్దరు నిందితులకు కోర్టు సమన్లు జారీ చేసింది.


రూ.55 కోట్ల బదిలీపై తీవ్ర ఆరోపణలు ఫార్ములా–ఈ రేసు నిర్వహణ కోసం విదేశీ సంస్థలకు భారీ మొత్తంలో నిధులు విడుదల చేయడంలో నిబంధనలు ఉల్లంఘించారనేది ఏసీబీ ప్రధాన ఆరోపణ. రాష్ట్ర కేబినెట్ అనుమతి లేకుండా, ఆర్థిక శాఖ ఆమోదం తీసుకోకుండానే నిధులను విదేశీ కరెన్సీ రూపంలో బదిలీ చేశారని ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు.

అప్పటి మంత్రిగా ఉన్న కేటీఆర్ ఇచ్చిన మౌఖిక ఆదేశాల మేరకే మిగతా 02లో

708 గ్రేహౌండ్స్ పోస్టుల

# సరెండర్

మావోయిస్టు ప్రభావం తగ్గడంతో కీలక నిర్ణయం



- గ్రేహౌండ్స్ బలగాల పునర్వ్యవస్థీకరణకు ప్రతిపాదన
- ఆక్టోపస్ ఆధునీకరణపై డీజీపీ సమీక్ష
- ఎయిర్‌పోర్టుల భద్రతపై ఆక్టోపస్‌కు కొత్త వ్యూహం
- రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటన

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు గణనీయంగా తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో గ్రేహౌండ్స్ బలాన్ని కొంతమేర తగ్గించాలని పోలీసు శాఖ నిర్ణయించిందని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఇందులో భాగంగా గ్రేహౌండ్స్‌కు చెందిన 708 పోస్టులను సరెండర్ చేసే ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపామని చెప్పారు. ప్రస్తుతం ఇది పెండింగ్‌లో ఉందని డీజీపీ వెల్లడించారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందిన వెంటనే ఆయా సిబ్బందిని తిరిగి మాతృ విభాగాలకు పంపే ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని రక్షణ దళాలైన గ్రేహౌండ్స్, ఆక్టోపస్ పనితీరు, కార్యచరణ పటిమపై రాష్ట్ర డీజీపీ మిగతా 02లో

# రాకాసి గాలులు

- 89 మంది ఉసురు తీసిన గాలి
- ఎండల తర్వాత ఎమర్జెన్సీలా మారిన వర్షం
- క్యుములోనింబస్ మేఘాల కరాళ నృత్యం
- 80-100 కిమీ వేగంతో వీచిన గాలులకు యూపీ అతలాకుతలం
- మనుషులు, పశువులు, ఇళ్లు.. ఒక్కరోజులోనే ఛిద్రమైన జీవితం
- ఇదో ప్రకృతి హెచ్చరిక

02



## మళ్లీ రూపాయి ధమాల్!

డాలర్ దూకుడులో రికార్డు స్థాయి పతనం!




- రూ.95.88కి కుప్పకూలిన రూపాయి..
- దేశ ఆర్థిక వ్యవస్థపై ఆందోళనలు
- చమురు మంటలు.. రూపాయిపై భారీ దెబ్బ
- పెట్రోల్ నుంచి ఫీజుల వరకు.. సామాన్యుడిపై రూపాయి ప్రభావం
- విదేశీ పెట్టుబడుల ఉపసంహరణతో రూపీకి షాక్
- రూపాయి బలహీనతతో ఐటీ, ఫార్మా రంగాలకు ఊరట
- రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు రంగంలోకి ఆర్బీఐ?

**ముద్ర డెస్క్ :** దేశీయ ఆర్థిక ముఖచిత్రంపై మరోసారి ఆందోళన మేఘాలు కమ్ముకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావం భారత కరెన్సీపై తీవ్రంగా పడింది. గత కొన్ని రోజులుగా ఊగిసలాటలో ఉన్న భారత రూపాయి విలువ గురువారం భారీగా క్షీణించి.. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ప్రస్తుతం ఒక అమెరికన్ డాలర్‌కు రూపాయి విలువ రూ.95.88 వద్ద ట్రేడవుతోంది. కేవలం ఈ ఒక్క వారంలోనే రూపాయి విలువ దాదాపు 1.4 శాతం మేర పతనం కావడం ఆర్థిక వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. మిగతా 02లో

ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 15.05.2026
www.mudranews.in | @mudranews



## మేక మాంసానికి ప్రాధాన్యత:



ఎండాకాలంలో గొర్రె మాంసం కంటే మేక మాంసం (Mutton) తీసుకోవడం చాలా ఉత్తమం. ఇందులో కొవ్వు తక్కువగా ఉండటం వల్ల శరీరంపై భారం పడకుండా ఉంటుంది.

# కేటీఆర్‌కు షాక్



(మొదటి పేజీ తరువాయి)

అధికార యంత్రాంగం నిధులను విడుదల చేసిందని ఏసీబీ తన నివేదికలో ప్రస్తావించింది. విదేశీ మారకద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనలను కూడా ఉల్లంఘించినట్లు దర్యాప్తు సంస్థ గుర్తించినట్లు సమాచారం. రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాలను పక్కన బెట్టి ఈ లావాదేవీలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**రంగంలోకి ఈడీ.. మనీ లాండరింగ్ కోణంలో విచారణ**

ఈ కేసు కేవలం ఏసీబీ దర్యాప్తుతోనే పరిమితం కాకుండా మరింత తీవ్రమవుతోంది. నిధుల బదిలీలో మనీ లాండరింగ్ కోణం ఉన్నట్లు భావిస్తున్న ఈడీ కూడా రంగం లోకి దిగింది. విదేశాలకు వెళ్లిన నిధుల మార్గాలు, అసలు లబ్ధిదారులు ఎవరు అనే అంశాలపై లోతుగా విచారణ సాగిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కేంద్ర ప్రభు త్వం, గవర్నర్ నుంచి ప్రాసిక్యూషన్ అనుమతులు లభించడంతో కేసు న్యాయపరంగా మరింత కీలక దశకు చేరుకుంది.

**రాజకీయ వేడి పెంచిన ఫార్ములా-ఈ**

ఫార్ములా–ఈ కేసు ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య తీవ్ర రాజకీయ పోరుకు దారి తీసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం, "హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పేరుతో ప్రజా ధనాన్ని విదేశీ సంస్థలకు మళ్లించారు" అంటూ కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది.

మరోవైపు కేటీఆర్ మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తున్నారు. "హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టేందుకు మాత్రమే ఫార్ములా–ఈ రేసును తీసుకొచ్చాం. ఇందులో ఎలాంటి అక్రమాలు లేవు. ఇది రాజకీయ కక్షసాధింపు చర్య" అని ఆయన స్పష్టం చేస్తున్నారు.

**ఇక ముందు ఏం జరుగుతుంది?**

జూలై 31న కేటీఆర్ కోర్టుకు హాజరైన అనంతరం ఆయనకు ఛార్జిషీట్ ప్రతులు అందజేయనున్నారు. ఆ తర్వాత ముందస్తు బెయిల్, క్వాష్ పిటిషన్ వంటి న్యాయపరమైన మార్గాలను ఆశ్రయించే అవకాశముందని న్యాయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ కేసు విచారణ మరింత వేగం పుంజుకుంటే తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలకు దారి తీసే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి జూలై 31న జరగబోయే కోర్టు విచారణపైనే నిలిచింది.

# బిహార్ ముఠా పనే!

**ముద్ర, కరీంనగర్ :**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కరీంనగర్ పీఎంజే జ్యువెలరీ షాప్ కేసును పోలీసులు ఎట్టకేలకు చేధించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను కరీంనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను గురువారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. కేసుకు సంబంధించిన వివరాలను కరీంనగర్ సీపీ గౌష్ ఆలం వెల్లడించారు. ఆ నిందితుల నుంచి పిస్టల్స్, వెహికల్స్, భారీగా ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్‌లో చోరీ చేసిన తర్వాత ఆ నగలు తీసుకుని పశ్చిమ బెంగాల్‌కు దొంగలు పరారయ్యారని పేర్కొన్నారు. నిందితులను బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో బిహార్‌కు చెందిన 'ది గోల్డెన్ తీఫ్' సుబోద్ సింగ్ మాస్టర్ మైండ్‌గా గుర్తించిన పోలీసులు.. అతడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ బంగారం చోరీలో ప్రత్యక్షంగా, పరోక్షంగా మొత్తం 13 మంది నిందితులు పాల్గొన్నట్లు కరీంనగర్ సీపీ గౌష్ ఆలం వెల్లడించారు. ఈ ఘటనలో ప్రత్యక్షంగా ఐదుగురు దొంగలు పాల్గొన్నారని.. ఇప్పటివరకు ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గ్యాంగ్ లీడర్ సుబోద్ సింగ్ సహా 10 మంది నిందితుల ఆచూకీ ఇంకా దొరకలేదని పేర్కొన్నారు.

పీఎంజే జ్యువెలరీ షాప్‌లో జరిగిన దొంగతనంలో మొత్తం 161 తులాల బంగారం తోపాటు.. 112 క్యారెట్ల వజ్ర ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు పోలీసులు వెల్లడించారు. దోపిడీకి ముందు ఈ నిందితులు ధర్మపురిలో ఆశ్రయం పొందినట్లు చెప్పారు. దొంగతనం తర్వాత వీరంతా 3 టీంలుగా విడిపోయి.. ధర్మపురి వద్ద తమ వాహనాలను వదిలేసి పారిపోయినట్లు తెలిపారు. అక్కడి నుంచి రైలు, బస్సు ద్వారా ఇతర రాష్ట్రాలకు వెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ ముగ్గురు నిందితుల నుంచి ఇప్పటివరకు రూ.51 వేల నగదుతోపాటు.. 2 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీళ్లు దొంగిలించిన బంగారాన్ని కొనుగోలు చేసిన వ్యాపారితో పాటు నిందితులను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం పోలీస్ టీమ్‌లు గాలింపు ఆపరేషన్ కొనసాగిస్తున్నాయని తెలిపారు. ఈ దోపిడీ కేసులో ప్రధాన నిందితుడు సుబోధ్‌సింగ్ కాగా.. అత్యాధునిక టెక్నాలజీతో ఈ ముఠా అనేక దొంగతనాలకు పాల్పడుతోందని పేర్కొన్నారు. ఈ చోరీ చేయడానికి ముందు 2 నెలల క్రితమే 4 ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారని.. అన్నింటి తర్వాత చివరికి కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెల్లర్స్‌లో దోపిడీ చేశారని వెల్లడించారు. బిహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో సుబోధ్ సింగ్ ముఠా గతంలో చోరీలకు పాల్పడిందని.. కానీ మన రాష్ట్రంలో ఇలాంటి దోపిడీలు జరగడం ఇదే తొలిసారి అని సీపీ గౌష్ ఆలం తెలిపారు.



# మళ్లీ రూపాయి ధమాల్!



(మొదటి పేజీ తరువాయి)

**పతనానికి ప్రధాన కారణాలు**

రూపాయి ఇంతలా కుదేలు కావడానికి అంతర్జాతీయ మార్కెట్లో పలు ప్రతికూల అంశాలు ఏకకాలంలో దాడి చేయడమే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. పశ్చిమ ఆసియా ప్రాంతంలో నెలకొన్న యుద్ధ వాతావరణం, ఉద్రిక్త పరిస్థితుల వల్ల సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 106 డాలర్లకు చేరింది. భారత్ తన చమురు అవసరాల్లో 80 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. చమురు ధర పెరిగినప్పుడల్లా భారత్ భారీగా డాలర్లను ఖర్చు చేయాల్సి వస్తోంది, ఇది రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉండటం, వడ్డీ రేట్లపై నెలకొన్న స్పష్టతతో అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ బలపడుతోంది. డాలర్ బలపడిన ప్రతిసారి వర్ధమాన దేశాల కరెన్సీలు, ముఖ్యంగా రూపాయి వంటివి బలహీనపడటం సహజంగా మారుతోంది. దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను భారీగా వెనక్కి తీసుకోవడం కూడా రూపాయి విలువను తగ్గించేలా చేస్తోంది.

**సామాన్యుడిపై భారాల జడివాన**

రూపాయి పతనం కేవలం గణాంకాలకే పరిమితం కాదు.. ఇది ప్రతి సామాన్యుడి జేబుపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. దిగుమతి చేసుకునే ముడి చమురు ఖరీదు పెరగడం వల్ల దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ ఆకాశాన్ని తాకే అవకాశం ఉంది. ఇంధన ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరిగి, తద్వారా కూరగాయలు, పప్పు ధాన్యాలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయి. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ఎలక్ట్రానిక్ విడిభాగాలు, చిప్‌లు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల ధరలు గణనీయంగా పెరిగే ప్రమాదం ఉంది. అమెరికా, యూరప్ దేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థుల తల్లిదండ్రులకు ఇది పెను భారమే. ఫీజులు చెల్లించడానికి ఇప్పుడు గతంలో కంటే ఎక్కువ రూపాయలను ఖర్చు చేయాల్సి ఉంటుంది. అలాగే విదేశీ పర్యటనలు ప్లాన్ చేసుకునే వారికి కూడా ఖర్చులు తడిసి మోపెడవుతాయి.

**ఎగుమతిదారులకు 'కొంత' ఊరట**

ఈ సంక్షోభ సమయంలో కేవలం ఎగుమతి రంగాలకు మాత్రమే సానుకూల ఫలితాలు దక్కే అవకాశం ఉంది. ఐటీ , ఫార్మా, టెక్స్టైల్స్ వంటి రంగాలు తమ సేవలను విదేశాలకు విక్రయించి డాలర్లలో ఆదాయాన్ని పొందుతాయి. రూపాయి బలహీనపడటంతో ఆ డాలర్లను రూపాయల్లోకి మార్చినప్పుడు వారికి అధిక లాభాలు వస్తాయి. అయితే ముడి సరుకును దిగుమతి చేసుకుని ఎగుమతి చేసే పరిశ్రమలకు మాత్రం ఈ ప్రయోజనం పెద్దగా ఉండకపోవచ్చు.

**ఆర్బీఐ ఏం చేయబోతోంది?**

రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇప్పటికే అప్రమత్తమైంది. తన వద్ద ఉన్న విదేశీ మారక నిల్వల ద్వారా మార్కెట్లో డాలర్లను విక్రయించి, రూపాయి విలువ మరీ పడిపోకుండా 'జోక్యం' చేసుకునే అవకాశం ఉంది. అయితే అంతర్జాతీయంగా భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గి, చమురు ధరలు అదుపులోకి వస్తే తప్ప రూపాయికి తక్షణ ఉపశమనం లభించడం కష్టమని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశ ఆర్థిక మూలస్తంభాలు బలంగా ఉన్నప్పటికీ బాహ్య కారణాలు రూపాయిని కుంగదీస్తున్నాయి. రానున్న రోజుల్లో ద్రవ్యోల్బణం పెరగకుండా ప్రభుత్వం, ఆర్బీఐ ఎలాంటి చర్యలు తీసుకుంటాయనేది ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది.

# మరో 16 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, పటిష్టంగా రూపొందించేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక అడుగు వేసింది. దేశంలోని 16 రాష్ట్రాల్లో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) మూడో దశను చేపట్టాలని గురువారం ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఈ భారీ కసరత్తు ద్వారా సుమారు 36.73 కోట్ల మంది ఓటర్లను కవర్ చేయాలని ఎన్నికల సంఘం లక్ష్యంగా పెట్టుకుంది. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, జాబితాలో ఉన్న తప్పులను తొలగించడం, డూప్లికేట్ ఓట్లను ఏరివేయడమే ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నది. మరోవైపు.. సంబంధిత రాష్ట్రాల ఎన్నికల అధికారులందరూ క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రతి ఇంటిని సర్వే చేయాలని ఈసీ సూచించింది. ముఖ్యంగా కొత్తగా ఓటు హక్కు పొందే యువత (18 ఏళ్లు నిండిన వారు) నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశాల్లో పేర్కొంది. రాబోయే ఎన్నికల దృష్ట్యా ఓటర్ల జాబితాలో ఎటువంటి అవకతవకలు లేకుండా, అత్యంత ఖచ్చితత్వంతో కూడిన డేటాను సిద్ధం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. గతంలో జరిగిన రెండు దశల విజయవంతమైన అమలు తర్వాత, ఇప్పుడు మూడో దశను భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. మూడో దశలో 3.94 లక్షలకు పైగా బూత్ స్థాయి అధికారులు. ఏపీలో జూలై 21 నుంచి సెప్టెంబర్ 18 వరకు ఓటర్ల ముసాయిదా జాబితా. ఏపీలో సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా ప్రకటన.

# 708 గ్రేహౌండ్స్ పోస్టుల సరెండర్

(మొదటి పేజీ తరువాయి)

సీవీ ఆనంద్ గురువారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. మావోయిస్టుల ఏరివేతలో దేశంలోనే మేటి దళంగా పేరుగాంచిన గ్రేహౌండ్స్‌లో పోస్టుల తగ్గింపుతో పాటు, ఉగ్రవాద వ్యతిరేక దళం ఆక్టోపస్‌ను ఆధునీకరించే అంశాలపై ఆయన మారుతున్న భద్రతా అవసరాలకు అనుగుణంగా శిక్షణలో నిరంతరం మార్పులు ఉండాలని, ఎలైట్ దళాలు ఎల్లప్పుడూ అత్యున్నత స్థాయి పోరాట పటిమను చాటాలని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన ఆయన.. సిబ్బందికి క్రమం తప్పకుండా ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించాలని, నిరంతరం శిక్షణను ఆధునీకరించాలని ఆదేశించారు. గ్రేహౌండ్స్ అంకితభావం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, ఆ పేరును కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని డీజీపీ కొనియాడారు.

**ఎయిర్‌పోర్టుల భద్రతపై ఆక్టోపస్ నజర్**

గురువారం ఇబ్రహీంపట్నంలోని ఆక్టోపస్ కమాండో శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన డీజీపీ అక్కడ కొత్తగా అభివృద్ధి చేసిన మౌలిక సదుపాయాలను పరిశీలించి, కమాండోలతో ముఖాముఖి మాట్లాడారు. ఉగ్రవాద దాడులు ఎదురైతే వాటిని తిప్పికొట్టేలా స్వాట్ బృందాల సన్నద్ధతపై ఆరా తీశారు. భవిష్యత్తులో నగరానికి రాబోయే కొత్త విమానాశ్రయాల భద్రతను దృష్టిలో ఉంచుకుని కార్యకలాపాల వ్యూహాలను పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు. వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా వివిధ భవన సముదాయాల్లో మాక్ ఆపరేషన్లు నిర్వహించడం అత్యంత కీలకమని డీజీపీ స్పష్టం చేశారు.

**24 గంటలూ నిఘా**

కమాండోలు శారీరక దృఢత్వంలో ప్రమాణాలు పాటించాలని, 24 గంటలూ విధులకు సిద్ధంగా ఉండాలని డీజీపీ సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి అవసరమైన అత్యాధునిక పరికరాల సేకరణకు పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ దళాలు రాష్ట్రానికే గర్వకారణమని ఆయన కొనియాడారు. ఈ సమీక్షా సమావేశాల్లో డీజీ ఆపరేషన్స్ డాక్టర్ అనిల్ కుమార్, ఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, గ్రూప్ కమాండర్ రాఘవేందర్ రెడ్డి, అదనపు ఎస్పీ రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

# 15 రోజుల్లోగా కొనుగోలు పూర్తవ్వాలి

**సీఎం రేవంత్ రెడ్డి**

## మొక్కజొన్న కొనుగోళ్లపై ఉన్నత స్థాయి సమీక్ష

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో మొక్కజొన్న పంటను 15 రోజుల్లోగా సేకరణ పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. రైతులు పండించి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే నాణ్యమైన ప్రతి మొక్కజొన్న గింజను సేకరించాలి. రవాణా చేసేందుకు తగిన వాహనాలు, హమాలీలు, గోనె సంచులు, నిల్వ స్థలం అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. మొక్కజొన్న కొనుగోళ్లపై గురువారం అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి సేకరణ కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించాలని ఆదేశించారు.. వర్షం నుండి పంటను కాపాడి రోజువారీ కొనుగోలు నివేదికలను సమర్పించాలని సూచించారు. వాహనాలు, లాజిస్టిక్స్ సహాయం అందించడంలో విఫలమైన కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మొన్నటి వరకు అధికారులు రాష్ట్రంలో రోజు సగటున 40 వేల నుంచి 45 వేల మెట్రిక్‌టన్నుల మొక్కజొన్న సేకరణ చేశారన్న సీఎం.. ఇప్పటివరకు 9.87 మెట్రిక్‌టన్నులు కొనుగోలు చేసినట్లు వివరించారు, గోదాముల్లో 4.93 లక్షల మెట్రిక్‌టన్నులు నిల్వ సామర్థ్యం ఉందన్నారు. ఇక నుంచి రోజువారీగా 50 వేల మెట్రిక్‌టన్నులు కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు చేసిన పంటను నిల్వలు 11,67 లక్షల మెట్రిక్‌టన్నులు కాగా గతం కంటే అదనపు నిల్వలు 1.80 లక్షల మెట్రిక్‌టన్నులు పెరిగిందని చెప్పారు. గోదాముల్లో నిల్వచేయబడిన పరిమాణం 4.93 లక్షల మెట్రిక్‌టన్నుల నుంచి 6.50 లక్షల మెట్రిక్‌టన్నులకు చేశారన్నారు. సరఫరాదారుల ద్వారా రవాణా పెరగడంతో గోనె సంచుల సరఫరా కూడా గణనీయంగా పెంపు జరిగిందన్న సీఎం.. హ్యాండ్లింగ్, రవాణా కాంట్రాక్టర్లతో సమన్వయంతో గోదాము పాయింట్ల వద్ద హమాలీ ఏర్పాట్లు బలోపేతం చేశారని చెప్పారు. రవాణా శాఖ సహకారంతో వాహనాలను సమీకరించడం, జిల్లా సరిహద్దుల్లో పర్యవేక్షక అధికారులను నియమించడం ద్వారా వాహనాల కొరత గణనీయంగా తగ్గిందన్నారు. అర్హులైన రైతులందరూ ఎలాంటి అసౌకర్యం లేకుండా తమ మొక్కజొన్నను కనీస మద్దతు ధరకు అమ్ముకునేలా జిల్లా కలెక్టర్లు ప్రతిరోజూ కొనుగోలు కార్యకలాపాలను పర్యవేక్షించాలన్నారు. ప్రతి అర్హుడైన రైతు తన పంటకు కనీస మద్దతు ధరను పొందేలా, సజావుగా, వేగంగా కొనుగోలు జరిగేలా చూసేందుకు ప్రభుత్వం, టీజీ మార్క్‌ఫెడ్ పనిచేయనున్నట్లు చెప్పారు



# రాకాసి గాలులు

**ముద్ర డెస్క్ :**

నిన్నటి వరకు నిప్పులు కురిపించిన ఆకాశం, కాస్త చల్లబడుతుందేమో అని ఆశపడ్డారు ఆ అమాయక ప్రజలు. కానీ, ఆ ఆశ అడియాశవుతుందని.. చల్లని జల్లుల వెనుక మృత్యువు రాకాసి గాలుల రూపంలో పొంచి ఉందని వారు ఊహించలేకపోయారు. ప్రకృతి కన్నెర్ర చేస్తే మనిషి ఎంత అల్పుడో చెప్పడానికి ఉత్తరప్రదేశ్ విషాదమే ఒక నిదర్శనం. గంటకు వంద కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు కేవలం చెట్లను, గోడలను మాత్రమే కూల్చలేదు; వేలాది కుటుంబాల ఆశలను, కలలను చిందరవందర చేశాయి. క్యుములోనింబస్ మేఘాలు కరాళ నృత్యం చేస్తుంటే.. ఆ భీకర గాలికి మనుషులు పిట్టల్లా ఎగిరిపోయారు. ఇల్లు కూలి తలదాచుకునే చోటు లేక కొందరు, పిడుగుపాటుకు ప్రాణాలు వదిలి మరికొందరు.. ఇలా 89 మంది సజీవ సమాధులయ్యారు.కళ్లముందే కొట్టుకుపోయిన పశువులు, నేలమట్టమైన గూడు, అంధకారంలో మునిగిన గ్రామాలు.. ఇది కేవలం ఒక వర్షం తెచ్చిన నష్టం కాదు, ప్రకృతి మానవాళికి ఇస్తున్న హెచ్చరిక.



**మేక మాంసం త్వరగా జీర్ణమవుతుంది**

మేక మాంసం త్వరగా జీర్ణమవుతుంది, కాబట్టి వేసవిలో జీర్ణ సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి. ఇది శరీరానికి అవసరమైన ప్రోటీన్లను అందిస్తూనే తేలికగా అనిపిస్తుంది.



# సింగరేణిలో తొలి మహిళా డంపర్ ఆపరేటర్లు

**నియామకానికి యాజమాన్యం సన్నద్ధత**
**13 దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్లను నడపనున్న మహిళా కార్మికులు**
**మహిళా శక్తికి ప్రాధాన్యత ఇవ్వాలన్న సర్కార్ ఆదేశంపై స్పందించిన సింగరేణి**
**ఆసక్తి గల మహిళలకు అవకాశాలు**
**హెవీ మోటార్ వెహికిల్ శిక్షణను పూర్తి చేసిన 13 మంది మహిళా ఉద్యోగులు**





**ముద్ర, తెలంగాణ బ్యూరో** : సింగరేణి చరిత్రలో తొలిసారిగా మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకానికి యాజమాన్యం శ్రీకారం చుట్టింది. మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థలో కూడా మహిళా శక్తికి ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలన్న మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు, ఓవర్ బర్డెన్ ను గని క్వారీ నుంచి ఉపరితలానికి రవాణా చేయడానికి యాజమాన్యం 60 నుంచి వంద టన్నుల భారీ డంపర్లను వినియోగిస్తోంది. సింగరేణిలో 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇప్పటివరకు కేవలం మగ ఆపరేటర్లు మాత్రమే ఈ భారీ డంపర్లను నడుపుతూ వస్తున్నారు. ఎందుకంటే ఈ డంపర్లను నడపడం కొంత కష్టంతో పాటు శారీరక దృఢత్వం, డ్రైవింగ్ నైపుణ్యం అవసరమై ఉంటాయి. పైగా మండే ఎండలు, భారీ వర్షాలు, తీవ్రమైన చలి పరిస్థితులను సైతం తట్టుకొని మూడు షిఫ్టుల్లో నడపాల్సి ఉంటుంది. కష్టతరమైన ఈ పనిని పురుష ఆపరేటర్లు మాత్రమే నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే సింగరేణి సంస్థలో ఇటీవల మహిళా ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలని, వారి నైపుణ్యాలను, శక్తి సామర్థ్యాలను కూడా వినియోగించేందుకు తగిన ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ గనుల్లో డంపర్ ఆపరేటర్లుగా పని చేసేందుకు ఆసక్తి గల మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులను కోరింది.

మొదట దాదాపు 35 మంది వరకు ముందుకు వచ్చారు. అయితే భారీ డంపర్లను నడిపేందుకు వారికి అంతకుముందే సాధారణ డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు భారీ వాహనాలను నడిపే లైసెన్స్ కూడా అవసరమై ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకున్న యాజమాన్యం సిరిసిల్లలో ఉన్న తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (టైడ్స్) అనే సంస్థ ద్వారా ఆసక్తి గల మహిళలకు కంపెనీ ఖర్చులతో భారీ వాహనాలపై ఉచిత డ్రైవింగ్ శిక్షణను అందించింది. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 13 మంది మహిళా ఉద్యోగులు తాము డంపర్ ఆపరేటర్లుగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కంపెనీకి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వీరందరికీ త్వరలో విడుదలయ్యే డంపర్ ఆపరేటర్ల నియామకల్లో అవకాశం కల్పించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో సింగరేణి సంస్థ కూడా ఆ దిశగా కీలక అడుగులు వేస్తోంది. పురుషులకు మాత్రమే పరిమితమైన కఠినమైన పనుల్లో మహిళలకు సైతం ప్రాధాన్యతనిస్తూ సింగరేణి సంస్థ తొలిసారిగా డంపర్ ఆపరేటర్లుగా మహిళలకు కూడా అవకాశం కల్పించటానికి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ విధంగా అనతి కాలంలోనే సింగరేణి సంస్థలో భారీ డంపర్లపై మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో కనపడే అవకాశం ఉంది. ఈ సందర్భంగా కొందరు మహిళా ఆపరేటర్లు మాట్లాడుతూ భారీ డంపర్లను నడపడం శారీరక కష్టం, నైపుణ్యంతో కూడుకున్న పని అని, తాము చేయగలమో లేదో అని కొంత భయపడినప్పటికీ, స్వయంగా డంపర్లు నడుపుతున్నప్పుడు తాము కూడా ఇటువంటి పనులు చేయగలమన్న ఆత్మవిశ్వాసం కలగిందన్నారు. నేటి ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాలతో పాటు రోదసిలోకి వెళ్తున్నారని, కనుక గనిలోని డంపర్లను మహిళలు నడపడం అంత కష్టమేమీ కాదని, ఇటువంటి మంచి అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి తాము ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు సింగరేణిలో మహిళా శక్తికి తగిన అవకాశాలు కల్పిస్తూ వస్తున్నామని, బెల్లంపల్లి ఖైరీగూడ ఓపెన్ కాస్ట్ గనిలో అత్యంత క్లిష్టమైన బ్లాస్టింగ్ విభాగంలో కూడా కేవలం మహిళలను మాత్రమే నియమించగా వారు పురుష ఉద్యోగులతో సమానంగా బ్లాస్టింగ్ ను నిర్వహిస్తున్నారని, అలాగే ఇతర విభాగాల్లో కూడా మహిళలు రాణిస్తున్నారని ఒక అధికారి పేర్కొన్నారు. సంస్థ చరిత్రలో తొలిసారిగా మహిళా రెస్క్యూ జట్టును కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇలాగే ఇకపై కూడా వివిధ క్లిష్టతరమైన ఉద్యోగాలలో ఆసక్తి గల మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు ఇవ్వడం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

# గవర్నర్ ఇంధన పొదుపు మంత్రం

**తనకు తానే వాహనాలు తగ్గించుకున్న గవర్నర్ ప్రతాప్ శుక్లా**
**సీఎం, మంత్రులూ ఆచరించాలని సూచన**
**ప్రధాని మోడీ పిలుపు మేరకు నిర్ణయం**



**ముద్ర, తెలంగాణ బ్యూరో** : పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇంధన పొదుపు చర్యలు పాటించాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపును తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ఆచరిస్తున్నారు. ఈ మేరకు ఆయనతన కాన్వాయ్‌ను తగ్గించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. దేశ ప్రధాని సందేశానికి మద్దతు ఇస్తున్నట్లు గవర్నర్ వెల్లడించారు. వాహనాలను తగ్గించే ప్రధాని కార్యక్రమాన్ని తాము అమలు చేస్తున్నట్లు చెప్పారు. లోక్ భవన్‌లో ఇప్పటికే సగం వాహనాలను తగ్గించామని అన్నారు. వాహనాలను తగ్గించడంతో ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, అధికారులు.. ప్రధాని సందేశాన్ని అమలు చేయాలని గవర్నర్ కోరారు. తెలంగాణ ప్రజలు కూడా ప్రధాని విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, కాలేజీల్లో ప్రధాని మోదీ సందేశాన్ని లైన్ ఇంప్లిమెంట్ చేయాలని కోరుతున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు.

# పంట కొనుగోళ్లలో సర్కార్ విఫలం

## బీజేపీ శాసనసభపక్ష నేత ఏలేటి



**ముద్ర, నిర్మల్** : వరి, మొక్కజొన్న, జొన్న కొనుగోళ్లలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని బీజేపీ శాసనసభపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. పంటల కొనుగోళ్లు చేయకపోవడంతో ప్రతిరోజూ రైతులు ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఇప్పటివరకు కనీసం 40శాతం కూడా పంటల కొనుగోళ్లు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. గురువారం నిర్మల్ జిల్లాలో రైతు ధర్నాలో మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. పంట కొనుగోళ్లలో జాప్యంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అకాల వర్షాలతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్న మాటలకు.. వాస్తవ పరిస్థితికి పొంతన లేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గన్నీసంచులను కూడా సరఫరా చేయలేని దీనావస్థలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. తడిసిన ధాన్యాన్ని పూర్తి మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తేమ, తరుగు పేరిట రైతులను దగా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మహేశ్వర్ రెడ్డి కోరారు.

# మున్సిపల్ కాంట్రాక్టర్లకు శిక్షణ




**ముద్ర, హైదరాబాద్** : మున్సిపాలిటీల్లో చేపట్టే నిర్మాణ పనుల్లో నాణ్యతతో పాటు కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ విశ్వనాధ్ రాజు అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలో తెలంగాణ అర్బన్ లోకల్ బాడీస్‌లో పనిచేస్తున్న ప్రభుత్వ సివిల్ కాంట్రాక్టర్లకు రెండు రోజుల రెండో విడత శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభమైంది.సిద్దిపేట, జగిత్యాల, మంచిర్యాల తదితర మున్సిపాలిటీల కాంట్రాక్టర్లు పాల్గొన్న ఈ శిక్షణలో క్వాలిటీ స్టాండర్డ్స్, ప్లానింగ్, ఎగ్జిక్యూషన్, డాక్యుమెంటేషన్, భద్రతా చర్యలపై అధికారులు అవగాహన కల్పించారు. రాష్ట్రంలో 276 మంది కాంట్రాక్టర్లకు ఏడు విడతల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సీడీఎంఏ రీజినల్ డైరెక్టర్ ఆర్. శ్రీనివాసరావు తెలిపారు.శిక్షణలో భాగంగా దుర్గం చెరువు, సిద్ధిపేట అమృత్ పార్క్, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ తదితర అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు పరిశీలించనున్నారు.సమావేశంలో రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ జియావుద్దీన్, వెంకటేశ్వర్లు, అనితా అగర్వాల్, వి. మోహన్ కుమార్, అనిల్ కుమార్ నాగమల్లేశ్వర రావ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా దుర్గం చెరువుతో పాటుగా రేపు సిద్ధిపేట మున్సిపాలిటీలోని అమృత్ పార్క్, సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్, ఎలేవేటేడ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్ జరిగిన పనుల తీరును కాంట్రాక్టర్లు పరిశీలిస్తారు.

# మనస్థాపం చెంది వృద్ధురాలు ఆత్మహత్య



**ముద్ర, కోరుట్ల:** మనస్థాపం చెంది వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మేడి పల్లి గ్రామానికి చెందిన గుండెల లక్ష్మి (59) అనే వృద్ధురాలు బుధవారం మధ్యాహ్నం ఆమె భర్త రాజన్నతో గొడవ పడి మనస్థాపం చెంది ఇంట్లో నుంచి బయటకు వెళ్లి, ఎంతకు రాకపోయే సరికి రాత్రి వరకు వెతికారు. మరుసటి రోజు ఉదయం 6 గంటల సమయంలో రాజేశ్వరరావుపేట గ్రామ శివారులోని ఎస్సారెస్పీ వరద కెనాల్లో దూకి ఆత్మహత్య చేసుకుందని గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె మరణంపై ఎలాంటి అనుమానం లేవని మృతురాలు చెల్లె ఆసరీ గౌరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై జీ నవీన్ తెలిపారు.

## తుంగతుర్తి మండలంలో మరో ఇద్దరు..

**ముద్ర, తుంగతుర్తి:** తుంగతుర్తి మండల పరిధిలో గురువారం ఇద్దరు వ్యక్తులు మరణించినట్లు స్థానిక ఎస్సై క్రాంతి కుమార్ తెలిపారు. సూర్య తండా ఆవాస గ్రామం గుట్ట కింది తండా కు చెందిన గుగులోతు బిక్షం(57) ఎస్సారెస్పీ పిల్ల కాలువలో చనిపోయి ఉన్నట్లు తెలిపారు. మరొక వ్యక్తి జనగామ జిల్లా కొడకండ్ల మండలం నీలిబండ తండా గ్రామపంచాయతీ ఆవాస గ్రామమైన వస్త్రం తండాకు చెందిన భూక్య పంతులు(50) తన కుటుంబంతో మండల పరిధిలోని మానాపురం గ్రామంలో వివాహ కార్యక్రమానికి వెళ్లి అక్కడ భార్యతో గొడవపడి, తిరిగి వస్తూ బాపన్ భాయ్ తండా దగ్గర చెట్టుకు ఉరివేసుకొని చనిపోయినట్లు తెలిపారు.

# 'నీట్' రద్దు.. మోడీ సర్కార్ వైఫల్యం



**మోడీ హయాంలోనే 93 పేపర్లు లీక్**
**ఆందోళనలో రెండు కోట్ల మంది విద్యార్థులు**
**కేంద్రం తీరుపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో** : నీట్–యూజీ 2026 రద్దు.. మోడీ ప్రభుత్వ నియంతృత్వ. నిరంకుశ నిర్ణయమని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష రద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. పదేండ్లుగా ప్రధాని మోడీ హయాంలో 93 పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. నీట్ రద్దు నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. నీట్ రద్దు దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసిన పెద్ద నోట్ల రద్దు వంటిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్యపూరితమైన ఈ నిర్ణయం దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని చెప్పారు. తీవ్ర ఒత్తిడిలో సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కల్లలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, నగలు అమ్మి తమ పిల్లలను పరీక్షకు ప్రిపేర్ చేయించారని, వారి ఆశలన్నీ గల్లంతవడం బాధాకరమన్నారు. 2019 నుంచి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయినా, ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయని ఆరోపించారు. గుజరాత్ రాష్ట్రంలోనే 14 పేపర్లు లీక్ అయ్యాయన్నారు. 2014 మే నెలలో మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి, దేశంలోని ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు బహిర్గతమయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ విడుదల చేసిన "ది పేపర్ లీక్ డెకేడ్" శ్వేతపత్రం ప్రకారం కేంద్ర, రాష్ట్ర పరీక్షలలో 93 పేపర్ లీక్ ఘటనలు జరిగాయని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. వీటివల్ల సుమారు 2 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారన్నారు. 2024లో కేవలం 8 వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు రద్దయ్యాయని తెలిపారు. నీట్–యూజీ (24 లక్షల మంది), యూజీసీ–నెట్ (9 లక్షలు), సీఎస్ఐఆర్–నెట్, నీట్–పీజీ రద్దు అయినట్లు గుర్తు చేశారు. 2024లో ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష (16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది) కొన్ని రోజుల్లోనే రద్దైందని, ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన లీక్‌లు జరిగాయన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఈ కుంభకోణాల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (తప్పుడు మార్గాల నివారణ) చట్టం'ను ఆమోదించినప్పటికీ, పెద్ద కుంభకోణాలు వెలుగు చూసిన తర్వాత 2024 జూన్ వరకు నోటిఫికేషన్‌ను కేంద్రం ఆలస్యం చేసిందన్నారు.

# చివరి గింజ వరకు ధాన్యం కొంటాం

**రాష్ట్ర ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**
**చెట్ల చెన్నారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రులు**
**రైతు శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం**



**ముద్ర, నల్గొండ** : రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చివరి గింజ వరకు ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుందని రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. నల్లగొండ జిల్లా చెట్ల చెన్నారంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులతో మంత్రులు నేరుగా మాట్లాడి వారి సమస్యలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చిందీ, ఎంత ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించారో, ఇంకా ఎంత ధాన్యం నిల్వలో ఉందో అధికారులను మంత్రులు ఆరా తీశారు. మిగిలిన ధాన్యాన్ని ఎన్ని రోజుల్లో పూర్తిగా కొనుగోలు చేస్తారన్న విషయంపై కూడా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేసిన మంత్రులు, యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా లారీల సంఖ్యను పెంచాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు పడకుండా ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గతంతో పోలిస్తే ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. కొంత హమాలీల సమస్య ఉన్నప్పటికీ, కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు వెంటనే డబ్బులు చెల్లించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం, వచ్చే పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించామని చెప్పారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వలు పేరుకుపోకుండా, ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించేందుకు లారీల సంఖ్య పెంచాలని ఆదేశించామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి శ్రీకారం చుట్టింది కాంగ్రెస్ పార్టీయేనని మంత్రి పేర్కొన్నారు. శ్రీరామ్ సాగర్, నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వాలే నిర్మించాయని గుర్తు చేశారు. ఆ ప్రాజెక్టుల ఫలితంగానే రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగి, ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. తెలంగాణను ఒకప్పుడు ఎగతాళి చేసిన వారే ఇప్పుడు రాష్ట్ర అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోతున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విధాలా అండగా నిలుస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ రైతు శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రభుత్వాన్ని విమర్శించే వారు ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించిన మంత్రి, ఎస్ఎల్ బీసీ ప్రాజెక్టును పూర్తి చేసి మరింత భూమిని సాగులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

శుక్రవారం 14.05.2026

www.mudranews.in | @mudranews



## వేసవిలో గొర్రె మాంసానికి దూరంగా ఉండాలి

గొర్రె మాంసంలో కొవ్వు శాతం ఎక్కువగా ఉండటం వల్ల ఇది శరీరంలో వేడిని విపరీతంగా పెంచుతుంది. దీనివల్ల వేసవిలో అసౌకర్యంగా అనిపించే అవకాశం ఉంది.



# ఉపాధి నిధుల్లో కోత



**- నిధులు విడుదలలో తీవ్ర జాప్యం!**
**- విబి గ్రామ్ జి గ్రామీణ పేదల పై వివక్ష!**
**- మే 15 న దేశవ్యాపితంగా సమ్మె**

గ్రామీణ పేదల జీవనాధారంగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ ఆర్ఈజీఏ) ప్రస్తుతం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. వ్యవసాయ పనులు లేని కాలాల్లో గ్రామీణ కూలీలకు కనీస జీవన భరోసా కల్పించేందుకు 2005లో యూపీఏ ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి సంవత్సరానికి కనీసం 100 రోజుల ఉపాధి హామీ ఇవ్వడం ఈ చట్టం ప్రధాన లక్ష్యం. రెండు దశాబ్దాలుగా ఈ పథకం లక్షలాది కుటుంబాలకు ఆర్థిక రక్షణగా నిలిచి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసింది.

అయితే 2014 తర్వాత ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు క్రమంగా తగ్గుతున్నాయని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. 2013లో రూ.1.05 లక్షల కోట్ల వరకు ఉన్న బడ్జెట్ కేటాయింపులు ప్రస్తుతం రూ.81 వేల కోట్లకు పరిమితమయ్యాయని పేర్కొంటున్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో పని దినాలు గణనీయంగా తగ్గిపోయాయి. ఒకప్పుడు 50 నుంచి 60 రోజుల వరకు పని దొరికిన కుటుంబాలు ఇప్పుడు 30 నుంచి 40 రోజులకే పరిమితమవుతున్నాయని ఆవేదన వ్యక్తమవుతోంది. పెరుగుతున్న ధరలు, జీవన వ్యయాల మధ్య పని దినాలు తగ్గడం వల్ల కూలీల వార్షిక ఆదాయం తీవ్రంగా పడిపోతోంది.

ఇక కేంద్ర ప్రభుత్వం "వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్-2025" పేరుతో కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా ఉపాధి హామీ చట్టంలో పలు మార్పులు చేపట్టింది. ఉపాధి రోజులను 100 నుంచి 125 రోజులకు పెంచుతామని ప్రకటించినప్పటికీ, నిధుల బాధ్యతలో కేంద్ర-రాష్ట్రాల వాటాను 90:10 నుంచి 60:40కు మార్చడం తీవ్ర విమర్శలకు దారితీసింది. నిబంధనలు, పర్యవేక్షణ మాత్రం కేంద్రం చేతిలోనే ఉంచి, ఆర్థిక భారం రాష్ట్రాలపై మోపడం ద్వారా పథకాన్ని బలహీనపరుస్తున్నారని ప్రతిపక్షాలు, కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

పార్లమెంట్‌లో ఈ బిల్లుపై జరిగిన చర్చల్లో వామపక్షాలు, కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. మహాత్మా గాంధీ పేరును తొలగించడం, గ్రామీణ పేదల హక్కులను తగ్గించడం, నిరుద్యోగ భృతి హక్కును నిర్వీర్యం చేయడం వంటి చర్యలు గ్రామీణ పేదలపై ప్రత్యక్ష దాడేనని విమర్శించాయి. రాష్ట్రాలపై 40 శాతం భారం మోపితే చాలా రాష్ట్రాలు పథకాన్ని సక్రమంగా అమలు చేయలేవని హెచ్చరించాయి. ఉపాధి హామీని 200 రోజుల వరకు పెంచాలని, దినసరి వేతనాన్ని కనీసం రూ.500లకు పెంచాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

తెలంగాణలోని పలు జిల్లాల్లో పని దినాలు భారీగా తగ్గినట్లు అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో 2023-24లో 55.88 లక్షల పని దినాలు కల్పించగా, 2025-26 నాటికి అవి 29.27 లక్షలకు పడిపోయాయి. అంటే రెండేళ్లలో దాదాపు 26 లక్షల పని దినాలు తగ్గిపోయాయి. ఒక కుటుంబానికి లభించే సగటు పని దినాలు 50 రోజుల నుంచి 31 రోజులకు పడిపోయాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో లక్షకు పైగా జాబ్ కార్డులు ఉన్నప్పటికీ, వాటిలో చాలా కార్డులు యాక్టివ్‌గా లేవు. నల్లగొండ జిల్లాలో కూడా పరిస్థితి దాదాపు ఇదే విధంగా ఉంది. పని దినాల కోత వల్ల ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన గ్రామీణ కూలీలు తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నారు.

ఇదిలా ఉంటే, వేతనాల చెల్లింపులో నెలల తరబడి జాప్యం కూలీలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. గతంలో 15 రోజుల్లో అందే కూలి ఇప్పుడు మూడు నుంచి నాలుగు నెలలు ఆలస్యంగా వస్తోందని కార్మికులు వాపోతున్నారు. ఆధార్ ఆధారిత చెల్లింపుల విధానం, ఫేస్ రికగ్నిషన్ యాప్ సమస్యలు కూడా కార్మికులకు శాపంగా మారాయి. చాలాసార్లు స్కాన్ కాకపోవడంతో పని ప్రదేశానికి పలుమార్లు వెళ్లి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వేసవి మండుటెండల్లో పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ, మెడికల్ కిట్లు వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం పరిస్థితిని మరింత దారుణంగా మారుస్తోంది.

చట్టంలో మార్పులు, నిధుల కొరత కారణంగా గ్రామీణ అభివృద్ధి పనులు కూడా నిలిచిపోతున్నాయి. ఒకప్పుడు ఉపాధి పనుల్లో భాగంగా గ్రామాల్లో చెరువులు, రహదారులు, మౌలిక వసతుల పనులు చేపట్టేవారు. ఇప్పుడు మెటీరియల్ కాంపోనెంట్ పనులు తగ్గిపోవడంతో కూలీలు కేవలం మట్టి పనులకే పరిమితమవుతున్నారు. గతంలో పనిముట్లు ప్రభుత్వమే అందించగా, ఇప్పుడు కూలీలే కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఈ నేపథ్యంలో పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఎన్ఆర్ఈజీఏ సంఘర్ష్ మోర్చా ఆధ్వర్యంలో మే 15న దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా పంచాయతీ కార్యాలయాల ముట్టడులు, నిరసనలు, ఆందోళనలు చేపట్టాలని కార్మిక సంఘాలు నిర్ణయించాయి. 160 మంది ఎంపీల సంతకాలతో ప్రధానమంత్రికి వినతిపత్రం అందజేయడం, పార్లమెంట్‌లో నిరసనలు చేపట్టడం వంటి కార్యక్రమాలను కూడా నిర్వహించ నున్నట్లు ప్రకటించాయి. గ్రామీణ పేదల జీవన హక్కును కాపాడాలంటే ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలని కార్మిక సంఘాలు స్పష్టం చేస్తున్నాయి.



**- ఉజ్జిని రత్నాకర్ రావు**
**9490952646**
**ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు**

## చేప ప్రసాదం పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు

**హైదరాబాద్ ఇన్ ఛార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** 179 ఏండ్లుగా ప్రజల విశ్వాసం, నమ్మకంగా కొనసాగుతున్న చేప ప్రసాదం కార్యక్రమం హైదరాబాద్ నగర ప్రత్యేకతగా నిలిచిందని హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణతో పాటు దేశంలోని పలు రాష్ట్రాలు, విదేశాల నుంచి కూడా వేలాది మంది భక్తులు, ఆస్తమా బాధితులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని చెప్పారు. ఈసారి సుమారు లక్షలాది మంది ప్రసాదం స్వీకరించే అవకాశం ఉందన్నారు. వచ్చే నెల 8న ఉదయం 11:00 గంటలకు 24 గంటల పాటు మృగశిర కార్తి ముహూర్తంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న 179 ఏళ్ల చరిత్ర కలిగిన చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గత అనుభవాలను సమీక్షించి లోపాలను సరిదిద్దుకుంటూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ 1847లో బత్తిని వీరన్న గౌడ్ ప్రారంభించిన ఈ చేప ప్రసాదం పరంపర 179 సంవత్సరాలుగా ప్రజల విశ్వాసంతో కొనసాగుతుండటం విశేషమన్నారు. మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ దేశ విదేశాల నుంచి వివిధ ప్రాంతాలు, మతాలు, వర్గాలకు చెందిన ప్రజలు విశ్వాసంతో ఈ కార్యక్రమానికి వస్తారని, ఇది అందరి కార్యక్రమమని అన్నారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా, టీజీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్, హైదరాబాద్ రీజినల్ మేనేజర్ సుధా పరిమళ, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్, ప్రాంతీయ సమాచార అధికారి రాములు, ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మనోహర్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీధర్, హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణ, అగర్వాల్ సమాజ్, జైస్వాల్ సమాజ్, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కేరళ సీఎంగా వీడీ సతీశన్..

**చివరి నిమిషంలో మారిన సమీకరణాలు.. వెనక్కి తగ్గిన కేసీ..**



**ముద్ర డెస్క్ :** కేరళ రాజకీయాల్లో గత పది రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు ఎట్టకేలకు తెరపడింది. సుదీర్ఘ తర్జనభర్జనల తర్వాత కేరళ కొత్త ముఖ్యమంత్రిగా వి.డి. సతీశన్ పేరును కాంగ్రెస్ హైకమాండ్ అధికారికంగా ప్రకటించింది. ఏఐసీసీ పరిశీలకులు దీపా దాస్ మున్షీ ఈ విషయాన్ని విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పదేళ్ల తర్వాత కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ అధికారంలోకి వచ్చింది. ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ భారీ విజయం సాధించినప్పటికీ, ముఖ్యమంత్రి ఎంపిక హైకమాండ్‌కు కత్తిమీద సాములా మారింది. రేసులో ముగ్గురు ఉద్దండులు ఉండటమే దీనికి కారణం. వీడీ సతీశన్‌తో పాటు కేసీ వేణుగోపాల్, రమేష్ చెన్నితాల సీఎం రేసులో పోటీపడ్డారు. అటు ఎమ్మెల్యేల ఓటింగ్‌లోనూ కేసీకే ఎక్కువ ఓట్లు వచ్చినట్లు సమాచారం. ఒకానొక దశలో కేసీ వేణుగోపాల్ పేరు ఖరారైందని వార్తలు వచ్చాయి. కానీ ప్రజల్లో, కార్యకర్తల్లో సతీశన్‌కు ఉన్న క్రేజ్‌ను గమనించిన హైకమాండ్ సతీశన్ వైపే మొగ్గు చూపింది.

**ఎవరీ వి.డి. సతీశన్?**

సతీశన్ 31 మే 1964న ఎర్నాకుళం ప్రాంతంలో జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన సతీశన్, విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు. 2001 నుంచి వరుసగా పారవూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలుస్తూ వస్తున్నారు. 2021లో కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, పినరయి విజయన్ ప్రభుత్వంపై పదునైన విమర్శలతో ప్రజల మనసు గెలుచుకున్నారు.

## కేరళం సీఎం సతీశన్‌కు రేవంత్ శుభాకాంక్షలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** కేరళం ముఖ్యమంత్రిగా ఎంపికైన వీడీ సతీశన్‌కు సీఎం ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. కేరళం ప్రజలకు దశాబ్దాలుగా సేవ చేస్తూ... విలువలతో కూడిన రాజకీయాలు చేసే సతీశన్‌కు ఈ పదవి రావడం సముచిత గుర్తింపు అని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని అన్నారు. పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, పరస్పర సహకారం వంటి రంగాల్లో కేరళం ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు.

## వనజీవి రామయ్య స్మారక చిహ్నానికి జూన్ లో శంకుస్థాపన

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ**

**ముద్ర, ఖమ్మం :** పద్మశ్రీ వనజీవిరామయ్య జ్ఞాపకార్థం జూన్ నెలలో స్మారక చిహ్నానికి శంకుస్థాపన చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. రామయ్య భార్య జానమ్మకు తప్పకుండా పింఛన్ అందజేస్తామని వెల్లడించారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ సత్యనారాయణపురం క్లస్టర్ పరిధిలో గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాదర్బార్ కు వచ్చిన రామయ్య భార్య జానమ్మకు మంత్రి హామీ ఇచ్చారు. ప్రకృతి ప్రేమికుడు, వన సంరక్షకుడు పద్మశ్రీ వనజీవి రామయ్య జ్ఞాపకార్థం జూన్ నెలలో స్మారక చిహ్నానికి శంకుస్థాపన చేయడంతో పాటు రామయ్య భార్య జానమ్మకు తప్పకుండా పింఛన్ అందేలా చేస్తానని ప్రజాదర్బార్ కు వచ్చిన ఆమెకు మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించి వెంటనే స్థలసేకరణ చేయాలని కలెక్టర్ కు మంత్రి ఆదేశించారు.

## ఆకాశం విసిరిన మృత్యుపాశం

**రాకాసి గాలులకు మనుషులే ఎగిరిపోయారు.. -89 మంది ప్రాణాలు తీశాయి..**

**ముద్ర డెస్క్ :** ఉత్తరప్రదేశ్‌లో ప్రకృతి ఒక్కసారిగా ప్రకోపించింది. ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు ఊరటనిస్తుందనుకున్న వర్షం.. రాకాసి గాలులు, వడగళ్ల వానగా మారి మృత్యుపాశం విసిరింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో సంభవించిన పిడుగుపాట్లు, గోడలు కూలడం , చెట్లు విరిగి పడటం వంటి ఘటనల్లో ఇప్పటివరకు 89 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 53 మంది తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అకాల వర్షం సృష్టించిన ఈ బీభత్సం పచ్చని పొలాలను, నిరుపేదల గూడును చిన్నాభిన్నం చేసింది.ఈ విపత్తు కేవలం మనుషులకే కాకుండా మూగజీవాలకు కూడా ప్రాణసంకటంగా మారింది. సుమారు 114 పశువులు ఈదురుగాలుల ధాటికి మరణించాయి. దాదాపు 87 ఇళ్లు పూర్తిగా ధ్వంసం కాగా, వందలాది గృహాలకు పాక్షిక నష్టం వాటిల్లింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో అనేక జిల్లాలు అంధకారంలో మునిగిపోయాయి. ఒక్కరోజులోనే ఇంత భారీ స్థాయిలో నష్టం సంభవించడం రాష్ట్ర యంత్రాంగాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఈ అకాల వర్షాలకు వాతావరణ శాస్త్రవేత్తలు క్యుములోనింబస్ మేఘాలను ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఈదురుగాలులు గంటకు 80-100 కిలోమీటర్ల వేగంతో వీయడం విధ్వంసానికి మరో కారణమైంది.

## నో వెహికల్ డే.. వర్క్ ఫ్రమ్ హోమ్..

**కేబినెట్ మీటింగ్ లో పొదుపు చర్యలపై సీఎం చంద్రబాబు ఫోకస్**



**ముద్ర డెస్క్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచనలతో పొదుపు బాట పట్టింది ఏపీలోని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం. మనదేశం-మన బాధ్యత పేరుతో పలు నిర్ణయాలను ప్రకటించింది. చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో ప్రధానంగా వనరుల ఆదాపైనే చర్చ జరిగింది. కాన్వాయ్‌ల తగ్గింపుతో సరిపోదన్న ముఖ్యమంత్రి మరిన్ని పొదుపు చర్యలను సూచించారు. వారానికి ఒక రోజు నో వెహికల్ డే పాటిద్దామని, కొన్ని రోజులు మంత్రుల విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాడాలని, అవసరమైతే సెక్రటేరియట్‌కి సైకిల్ మీద రావాలన్నారు చంద్రబాబు. ప్రతి శుక్రవారం నో వెహికల్ డే గా అనుసరించాలని సూచించారు. విద్యుత్ కంటే.. సోలార్ ఎనర్జీనే ఎక్కువ వినియోగించేలా చర్యలు తీసుకోవాలని.. చంద్రబాబు సూచించారు.

అధిక సంఖ్యలో సమావేశాలు వర్చువల్‌గా నిర్వహించాలని సీఎం చంద్రబాబు సూచించారు. దీంతోపాటు ప్రెజెన్స్ అవసరం లేని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ఖర్చులు తగ్గించాలని, జిల్లాల పర్యటనల్లోనూ కాస్ట్ కటింగ్ పాటించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొంతమంది అధికారులు నాలుగైదు కార్లు వినియోగిస్తున్నారని.. ఇకపై ఒక అధికారికి ఒక అధికారిక వాహనమే ఉండాలని సీఎం స్పష్టం చేశారు.

కాగా.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పొదుపు సూచనలతో పలు రాష్ట్రాల ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఢిల్లీలో ప్రభుత్వ ఉద్యోగులకు 2 రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వనున్నట్లు సీఎం రేఖా గుప్తా ప్రకటించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వాహనాల సంఖ్యను 50 శాతానికిపైగా తగ్గిస్తూ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు.

## ఇండ్ల మంజూరీ పార్టీలకు అతీతంగా చేయాలి

**రేషన్ దుకాణాల్లో సీఎం ఫోటో తో పాటు ప్రధాన మంత్రి ఫోటో ఉండాల్సిందే**
**- పాలమూరు ఎంపీ డీకే అరుణ**



**ముద్ర, నారాయణపేట:** ఇండ్ల మంజూరి నీ పార్టీలకు అతీతంగా మంజూరు చేయాలని...రేషన్ దుకాణాల్లో సీఎం ఫోటో తో పాటు ప్రధాన మంత్రి ఫోటో ఉండాల్సిందేనని పాలమూరు ఎంపీ డీకే అరుణ ఆదేశించారు. గురువారం నారాయణపేట జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి,సమన్వయ పర్య వేక్షణ కమిటీ (దిశ) మూడవ సమావేశం పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డీ.కే. అరుణ అధ్యక్షతన నిర్వహించగా ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కోటకొండ - కోయిల కొండ మధ్య రోడ్డు పనులు ఎందుకు నిలిచిపోయాయనీ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 45 ప్రభుత్వ శాఖల పరిధిలో కేంద్ర,రాష్ట్ర నిధులతో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఎంపీ డీకే అరుణ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. జిల్లా పంచా యతీ అధికారి సుధాకర్ రెడ్డి జిల్లాలో 272 గ్రామ పంచాయతీలకు గాను 201 గ్రామాల్లో సొంత పంచాయతీ కార్యాలయ భవనాలున్నాయని, మిగతా 71 పంచాయతీలకు సొంత భవనాలు లేవని తెలిపారు. స్పందించిన ఎంపీ అరుణ ఇప్పటికీ సొంత పంచాయతీ కార్యాలయ భవనాలు లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో చాలా మంది సర్పంచులు చేసిన పనులకు నేటికి బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు ఉన్నారా లేదా అని ఎంపీ ఆరా తీశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో కేంద్రం వాటా గురించి తెలిపిన ఎంపీ అరుణ ఇండ్ల మంజూరి నీ పార్టీలకు అతీతంగా చేయాలని హౌసింగ్ పీడీ శంకర్ నాయక్ ను ఆదేశించారు. కలెక్టర్ సీహెచ్. ప్రియాంక మాట్లాడుతూ...దిశ సమావేశంలో శాఖల వారీగా చర్చించిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని,ఆయా శాఖలు అమలు చేస్తున్న కార్యక్రమాలు లక్ష్యం మేరకు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా శాఖలు చేపట్టే పనులు ప్రారంభించినప్పుడు ప్రోటోకాల్ తప్పక పాటించాలని ఆదేశించారు.

## హైదరాబాద్‌లో ఫోటో జర్నలిస్ట్ రఘు రాయ్ సంస్మరణ సభ




ముద్ర, హైదరాబాద్ : హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుప్రసిద్ధ ఫోటో జర్నలిస్ట్ రఘు రాయ్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ సెక్రటరీ జనరల్ డి. సోమసుందర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కె. రాములు, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు కె. సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి, సీనియర్ ఫోటో జర్నలిస్ట్ రవీందర్ రెడ్డితో పాటు పలువురు ఫోటో జర్నలిస్టులు హాజరై రఘు రాయ్ సేవలను స్మరించుకున్నారు. ఫోటో జర్నలిజం రంగంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు.

## సముద్ర గర్భంలో గ్యాస్ పైప్‌లైన్

**సముద్రం అడుగున ఓమన్ - గుజరాత్ గ్యాస్ పైప్‌లైన్!**




**ముద్ర డెస్క్ :** భారత్ ఇంధన భద్రతను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గల్ఫ్ దేశాల నుంచి ఎలాంటి అంతరాయాలు లేకుండా సహజ వాయువును దిగుమతి చేసుకునేందుకు ఓమన్ నుంచి గుజరాత్ వరకు సముద్రం అడుగున భారీ గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.40 వేల కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ మెగా ప్రాజెక్టు అరేబియా సముద్రంలో సుమారు 2,000 కిలోమీటర్ల మేర విస్తరించనుంది.

హర్మూజ్ జలసంధిలో పెరుగుతున్న భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా గ్యాస్ సరఫరాలో ఆటంకాలు ఏర్పడుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. సముద్ర మట్టానికి 3,450 మీటర్ల లోతులో నిర్మించే ఈ పైప్‌లైన్ ద్వారా రోజుకు 31 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల సహజ వాయువు భారత్‌కు చేరనుంది. ఈ ప్రాజెక్టును వచ్చే ఐదు నుంచి ఏడేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ప్రస్తుతం భారత్ గ్యాస్ దిగుమతుల్లో ఎక్కువ భాగం ఎల్ఎన్‌జీపై ఆధారపడుతోంది. అంతర్జాతీయ సంక్షోభాల సమయంలో గ్యాస్ ధరలు భారీగా పెరగడం దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోంది. ఈ పైప్‌లైన్ ద్వారా తక్కువ ధరకు, నిరంతర సరఫరాతో గ్యాస్ అందుబాటులోకి రానుంది. భవిష్యత్తులో యూఏఈ, సౌదీ అరేబియా, కతార్, ఇరాన్ వంటి దేశాల నుంచి కూడా గ్యాస్ దిగుమతులకు ఈ ప్రాజెక్టు కీలక మార్గంగా మారనుంది.

ఇంధన రంగంలో చైనాకు పోటీగా నిలవాలన్న లక్ష్యంతో భారత్ ఈ ప్రాజెక్టును వ్యూహాత్మకంగా ముందుకు తీసుకెళ్తోంది. ప్రాజెక్టు పూర్తయితే భారత్ ఇంధన రంగంలో మరింత బలమైన దేశంగా అవతరించే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 15-05-2026
www.mudranews.in | @mudranews



### గొర్రె మాంసం
### అజీర్తి సమస్యల నివారణ

ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు గొర్రె మాంసం తింటే గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో దీనిని తినకపోవడమే మంచిది.



## ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**




**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని నెంబర్ వన్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన "ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలు సాధిస్తున్న మెరుగైన ఫలితాలే దీనికి నిదర్శనమన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అలాగే జిల్లాలో డ్రాప్‌అవుట్ విద్యార్థుల సంఖ్య తగ్గించేందుకు అమ్మ ఆదర్శ కమిటీలు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. సమ్మర్ క్యాంపుల నిర్వహణతో పాటు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ, కమిషనర్ మధుసూదన్ రెడ్డి, వార్డ్ కౌన్సిలర్లు, ఎమ్మార్వో, ఎంపీడీవో, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉంది

**- ప్రిన్సిపాల్ మదన్ మోహన్**




**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. వారోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కళాశాల అభివృద్ధికి వారు అందించిన సేవలను గుర్తిస్తూ శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మదన్ మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించి ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలని కోరారు. అలాగే పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను ప్రస్తుత విద్యార్థులతో పంచుకుని వారికి మార్గదర్శకులుగా నిలవాలని సూచించారు. అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ మహమ్మద్ ఇర్ఫాన్, అధ్యాపకులు అంజయ్య, వనిత, ఉమాదేవి, రామకృష్ణ, శైలజతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధ్వని కాలుష్యంపై పోలీసుల కఠిన చర్యలు



**ముద్ర, మల్కాజ్గిరి:** మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో ధ్వని కాలుష్య నియంత్రణ కోసం ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చిన వాహనాలపై కఠిన చర్యలు తీసు కున్నారు. గురువారం ఒక్కరోజే 451 కేసులు నమోదు చేసి, రూ. 6.14 లక్షల జరిమానా విధించారు. అలాగే 76 వాహనాల నుంచి అనధికారిక సైలెన్సర్లను అక్కడికక్కడే తొలగించారు. అధిక శబ్దం వల్ల ప్రజలకు, ముఖ్యంగా వృద్ధులు, రోగులు, చిన్నపిల్లలకు ఇబ్బందులు కలుగుతాయని పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని సూచించారు.

## మెగా జాబ్ డ్రైవ్‌కు భారీ స్పందన




**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో నిర్మాణ్ సంస్థ, డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వ ర్యంలో నిర్వహించిన మెగా జాబ్ డ్రైవ్ విజయవంతంగా ముగిసింది. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక విద్యావారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి నిరుద్యోగ యువత భారీగా హాజరయ్యారు. ఇన్ఫోసిస్ ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఈ జాబ్ డ్రైవ్‌లో జియో, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్, ఫ్లిప్కార్ట్, అపోలో, మెడ్‌ప్లస్, ముత్తూట్ ఫైనాన్స్, శ్రీరామ్ చిట్స్ సహా 15కు పైగా ప్రముఖ సంస్థలు పాల్గొన్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహిం చిన ఆన్‌స్పాట్ ఇంటర్వ్యూలకు 18 నుంచి 30 ఏళ్ల వయస్సు గల ఫ్రెషర్స్, అనుభవజ్ఞులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. గీతాంజలి మాట్లాడుతూ నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. 200 మందికి పైగా అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారని, అర్హత సాధించిన పలువురికి వెంటనే ఆఫర్ లెటర్లు అందజే శారని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా నిర్మాణ్ సంస్థ, డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ సెల్ సహకారంతో మరిన్ని జాబ్ డ్రైవ్‌లు నిర్వహించి జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. దీపిక, అధ్యాపకులు కృష్ణయ్య, హాజీరా, ధర్మ, రవీందర్, అశోక్, చంద్రశేఖర్ మరియు నిర్మాణ్ సంస్థ ప్రతినిధులకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.



# ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

**- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జోగులాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం, కొండాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవకతవకలకు తావులేకుండా సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ముందుగా కేంద్రానికి తీసుకొచ్చిన రైతుల ధాన్యానికే ప్రాధాన్యత ఇవ్వాలని, తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా వచ్చిన వెంటనే తూకం చేసి మిల్లులకు తరలించాలని సూచించారు. ప్యాడి క్లీనర్స్ వినియోగించి ధాన్యాన్ని శుభ్రపరిచిన తర్వాతే మిల్లులకు పంపించాలని, లేదంటే మిల్లర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కొనుగోలు ప్రక్రియ పూర్తైన వెంటనే ఓపీఎంఎస్ నమోదు చేయాలని, లేనిచో రైతులకు చెల్లింపులు ఆలస్యమవుతాయని హెచ్చరించారు. ట్రక్ షీట్లలో తప్పిదాలు లేకుండా రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, నిబంధనలు అతిక్రమిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

### చెక్‌పోస్టుల వద్ద పటిష్ట తనిఖీలు అవసరం

నందిన్నె అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్‌ను కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇతర రాష్ట్రాల వరి, మొక్కజొన్న రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వాహనాల నంబర్లు, బిల్లులు, సంబంధిత పత్రాల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, అవసరమైతే వాహన పత్రాల ఫోటోలు కూడా భద్రపరచాలని తెలిపారు. చెక్‌పోస్ట్ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు.

### యంగ్ ఇండియా పాఠశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

కేటీదొడ్డి మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. జంగిల్ క్లియరెన్స్, ల్యాండ్ లెవెలింగ్ పూర్తయినందున అకాడమిక్ బ్లాక్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని గుత్తేదారునికి సూచించారు. ఒప్పందం ప్రకారం ఏడాదిన్నరలో పనులు పూర్తి చేయాల్సి ఉందని, అందుకు అనుగుణంగా నిర్మాణాలు కొనసాగించాలని తెలిపారు. విద్యుత్ లైన్ మార్పు సమస్యను విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ పర్యటనలో పౌర సరఫరాల శాఖ మేనేజర్ విమల, డిఆర్డిఏ ఏపీడి శ్రీనివాస్, కేటీ దొడ్డి తహసిల్దార్ కరుణాకర్, ఎంపీడీవో రమణారావు, విద్యాశాఖ ఇంజనీర్ మోహన్ రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి రాజవర్ధన్ రెడ్డి, ఏపీఎం చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 'వన్ డే వన్ వార్డు' కార్యక్రమంపై సమీక్ష

**- పాల్గొన్న పీయేసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ**



**ముద్ర, శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్ డివిజన్ పీజేఆర్ స్టేడియంలో నిర్వహించిన 'వన్ డే వన్ వార్డు' కార్యక్రమంలో కాలనీల సమస్యలు, అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పీయేసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ, సైబరా బాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి, డీసీ శశిరేఖ, అధికారులు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ కాలనీవాసులు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వర్షాకాలానికి ముందే అసంపూర్తిగా ఉన్న నాలాల విస్తరణ పనులు పూర్తి చేయాలని, నాలాల పూడికతీత చేపట్టి నీటి ప్రవాహం సాఫీగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. భవానిపురం నాలా విస్తరణ పనులను ప్రాధాన్యతగా చేపట్టాలని, వేమన కాలనీ, సురక్ష, శంకర్‌నగర్ కాలనీల్లో పార్కుల అభివృద్ధి, సుందరీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో సీఎంసీ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, స్పోర్ట్స్ విభాగాల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### రూ.15.37 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 41 మంది లబ్ధిదారులకు రూ.15,37,500ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆరెకపూడి గాంధీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు, చంద్రమోహన్ సాగర్, నవీన్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

## మెట్రోలో ప్రయాణించిన ఎంపీ




**ముద్ర, శేరిలింగంపల్లి:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు గురువారం ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ మెట్రో రైలులో ప్రయాణించారు. రాజకీయ నేతలు మాటలు చెప్పడమే కాదు చేతల్లో చూపించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## గ్రీన్ ఫీల్డ్ కాలనీ భూ సమస్య పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలి




**ముద్ర,మేడ్చల్ జిల్లా ప్రతినిధి:** మేడ్చల్ జిల్లా అల్వాల్–ఖానాజిగూడలోని గ్రీన్ ఫీల్డ్ కాలనీ భూ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని గ్రీన్ ఫీల్డ్ కాలనీ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ కాలనీ భూ వివాదం కోర్టులో విచారణలో ఉండగానే కొన్ని అక్రమ రిజిస్ట్రేషన్లు, అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఖానాజిగూడ, పద్మావతి నగర్ పరిధిలోని యూఎల్‌సీ ప్లాట్లకు సంబంధించిన సర్వే నంబర్లను మార్చి అల్వాల్ మున్సిపాలిటీ అధికారులు నాలుగు ఇళ్లకు అక్రమ అనుమతులు ఇచ్చారని తెలిపారు.

అలాగే ప్లాట్ నెం.144కు సంబంధించిన అసలు పత్రాలను ఫాబ్రికేట్ చేసి సంజీవ్ రెడ్డి అనే వ్యక్తి ఆక్రమణలకు పాల్పడ్డారని ఆరోపించారు. సర్వే నెం.385కు అక్రమంగా పాస్‌బుక్స్ సృష్టించి, వ్యవసాయ భూమిగా చూపిస్తూ 2023లో పాస్ బుక్స్ పొందిన విషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లగా, 2025 ఫిబ్రవరిలో ఆ పాస్ బుక్స్‌ను రద్దు చేసినట్లు వెల్లడించారు. అయితే సమస్య ఇంకా కోర్టులోనే పెండింగ్‌లో ఉండటంతో అక్రమ రిజిస్ట్రేషన్లు, నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వే నెం.375 పేరుతో కూడా కొందరు ప్లాట్లను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని పేర్కొన్నారు.

ప్రభుత్వ యంత్రాంగం ఈ సమస్యను పట్టించుకోకపోవడం వల్ల కేసు పరిష్కారం ఆలస్యం అవుతోందని, జిల్లా అధికారులు వెంటనే జోక్యం చేసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అసోసియేషన్ నాయకులు కోరారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి తోడ్పాటు అందిస్తాం..

**- వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సముద్రాల కృష్ణమూర్తి**



**ముద్ర, కుషాయిగూడ:** జర్నలిస్టుల సంక్షేమానికి తోడ్పాటునందిస్తామని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సముద్రాల కృష్ణమూర్తి అన్నారు. హెచ్బీ కాలనీ ఉమా ఆప్టికల్స్ అధినేత నేర్లకంటి శ్రీనివాస్ సమకూర్చిన సన్ గ్లాసెస్ చలువ అద్దాలను గురువారం ఆయన కాప్రా ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలను వెలికి తీయడంలో జర్నలిస్టులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. జర్నలిస్టుల సంక్షేమానికి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో పూర్తి సహకారం అందజేస్తుందన్నారు. కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ అధ్యక్షుడు వద్లూజు జ్యోతిర్మయ చారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజె రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, వాసవి క్లబ్ ప్రతినిధులు పెనుగొండ వెంకటేశ్వర్లు లక్ష్మీ సామ్రాజ్యం, కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పలుగుల పవన్, లక్కిడి బాల్రెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శి గడ్డమీద బాలరాజు గౌడ్, సెక్రటరీ రోజా రాణి, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.




## పని మనుషుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- ఏసీపీ వెంకట్ రెడ్డి**

**ముద్ర, కాప్రా:** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో గురువారం కమ్యూనిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఏసీపీ వెంకట్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల జరుగుతున్న దొంగతనాల నేపథ్యంలో కాలనీవాసులు ముఖ్యంగా పని మనుషుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో మేడ్ సర్వెంట్ల నమోదు ప్రక్రియ, సమ్మర్ సీజన్‌లో పెరుగుతున్న దొంగతనాల నివారణ చర్యలు, సైబర్ క్రైమ్‌లపై అవగాహన, యాంటీ డ్రగ్స్ కార్యక్రమాలు, కాలనీ భద్రత అంశాలపై చర్చించారు. కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు భద్రతా చర్యల్లో భాగస్వాములు కావాలని పోలీసులు కోరారు. ప్రజల సహకారం ఉంటేనే కాలనీల్లో భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని సీఐ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. "మీ సహకారమే ప్రజల భద్రతకు బలం" అని తెలిపారు.

## జనగణన కార్యకలాపాలపై జోనల్ కమిషనర్ సమీక్ష

**ముద్ర, శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయన్ అమిత్ జోనల్ కాన్ఫరెన్స్ హాల్ లో జనగణన కార్యకలాపాలపై వార్డుల నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వార్డుల వారీగా జనగణన ఎన్యుమరేషన్ పురోగతిని సమీక్షించారు. ఖచ్చితమైన సమాచార సేకరణతో పాటు ప్రజల్లో సమర్థవంతమైన అవగాహన కల్పించి, నిర్ణీత గడువులోగా జనగణన కార్యక్రమాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటి వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని, జనగణన ప్రాముఖ్యతపై ప్రజలకు విస్తృత ప్రచారం నిర్వహించాలని జోనల్ కమిషనర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి జనగణన ప్రక్రియను వేగవంతం చేయాలని వార్డు నోడల్ అధికారులకు తెలిపారు.

జనగణన దేశాభివృద్ధికి, ప్రభుత్వ పథకాల రూపకల్పనకు కీలకమని పేర్కొంటూ ప్రజలందరూ అధికారులకు సహకరించాలని నారాయన్ అమిత్ విజ్ఞప్తి చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 15.05.2026
www.mudranews.in | @mudranews



**మాంసం మితంగా భుజించడం:**

ఏ మాంసమైనా సరే, వేసవిలో అతిగా తినడం ఆరోగ్యానికి హాని కరం. తక్కువ పరిమాణంలో తీసుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రత అదుపులో ఉంటుంది.



# రైతు కుటుంబానికి మంత్రి అడ్లూరి భరోసా

**-రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేత**



**ముద్ర, గొల్లపల్లి:** ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సామాన్య రైతు కుటుంబానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే మానవత్వమని నిరూపిస్తూ, బాధిత కుటుంబానికి రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

**ఘటన వివరాల్లోకి వెళ్తే..**

గొల్లపల్లి మండలం అగ్గిమల్ల గ్రామానికి చెందిన రైతు గుడ్ల రాజయ్య ఇటీవల జరిగిన టిప్పర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన కరీంనగర్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం రైతును పరామర్శించడానికి వెళ్లిన మంత్రి లక్ష్మణ్ కుమార్ కు జరిగిన లిఫ్ట్ ప్రమాదం అందరికీ తెలిసిందే. పెను ప్రమాదం నుండి బయట పడ్డారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఆ రైతు చికిత్స పొందుండగా.. ఆసుపత్రి ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్న విషయం కలిసి వేసింది.

**వెంటనే స్పందించిన మంత్రి..**

విషయం తెలిసిన వెంటనే మంత్రి మానవతా దృక్పథంతో స్పందించారు. రాజయ్య వైద్య చికిత్సల నిమిత్తం తక్షణ సహాయంగా రూ. యాభై వేల నగదును కేటాయించారు. మంత్రి సూచన మేరకు స్థానిక నాయకులు, రైతుల ద్వారా ఈ ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతు పక్షపాతిగా ఉంటుందన్నారు. రాజయ్య త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు.

**కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు..**

మంత్రి చూపిన ఈ చొరవపై అగ్గిమల్ల గ్రామస్తులు మరియు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన రైతు కష్టాల్లో ఉన్నప్పుడు స్వయంగా స్పందించి, ఆర్థిక భరోసా కల్పించిన మంత్రికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్గిమల్ల సర్పంచ్ కంకణాల వసంత లక్ష్మణ్, జెల్ల అఖిల అనిల్, గొల్లపల్లి ఉపసర్పంచ్ గురజాల బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సట్టా ఎల్లయ్య పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో మెరుగైన వసతులు కల్పించాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ మున్సిపాలిటీలో మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నిర్మల్ మున్సిపాలిటీకి సంబంధించి పలు అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజు మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తాగునీరు నిల్వ ఉంచే నీటి ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా త్రాగునీరు అందించాలన్నారు. పచ్చదనం పెంపుపై దృష్టి సారించాలన్నారు. పెండింగ్ పన్నులను త్వరితగతిన వసూలు చేయాలన్నారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలిగితే వెంటనే స్పందించి, ఆ సమస్యలు తొలగించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వేసవి శిబిరాన్ని వినియోగించుకోవాలి

**ముద్ర, కోరుట్ల:** వేసవి శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ కె.రాము కోరారు. కోరుట్ల పట్టణంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 6వ తరగతి నుండి 9 వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిబిరం (సమ్మర్ క్యాంపు)ను గురువారం డీఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ వేసవి కాలంలో సమయాన్ని వృధా చేయకుండా శిక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కుట్టుపని, మ్యూజిక్, డ్రాయింగ్, పర్సనాలిటీ డెవలప్మెంట్, చెస్, సింపుల్ సైన్స్ ఎక్స్పరిమెంట్, ఇన్డోర్ గేమ్స్, మోడలింగ్, మ్యాథమేటిక్స్, క్విజ్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ వంటి పలు అంశాలలో నిపుణులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

వంద మంది విద్యార్థులకు అవకాశం ఉందని, విద్యార్థులకు అల్పాహారం, నీటి వసతి అందుబాటులో ఉందన్నారు. కోరుట్ల మండలంలో ఎఫ్ ఆర్ ఎస్ అటెండెన్స్ లో ఉత్తమ గణాంకాలు నమోదు చేసుకున్న ఉపాధ్యాయులకు ప్రశంశపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గంగుల నరేశం, ప్రధానోపాధ్యాయులు వి.గంగాధర్, ఉపాధ్యాయులు, సీఆర్పీ లు గంగాధర్, సత్యనారాయణ, జ్యోతి, మాన్విత పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమం పట్టని ప్రభుత్వం

**- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం పట్టించుకోవడం లేదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ గురువారం నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంటల కొనుగోళ్లలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిస్తోందని మండిపడ్డారు. రైతాంగానికి తమ పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. రైతు కష్టానికి కన్నీరు మిగిల్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. 141 లక్షల టన్నుల ధాన్యం పండితే, 90 లక్షల టన్నులు కొంటామని ప్రకటించారన్నారు. ఐతే ఇప్పటివరకు కేవలం 14 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేసి రికార్డు కొనుగోళ్లు అంటూ అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. కళ్లముందే పంట తడుస్తున్నా రైతును దళారుల దయకు వదిలేసిందన్నారు. వరి కొనుగోళ్లలో వైఫల్యం, మక్కజొన్న రైతుకు క్వింటాల్‌కు వందల రూపాయల నష్టం, హమాలీ లోడింగ్ పేరుతో ప్రతి బస్తాకు అక్రమ వసూళ్లు ...ఇవి పాలన విజయాలు కాదు, రైతు రక్తాన్ని పిండే దోపిడీ అన్నారు. అభయహస్తం అన్న కాంగ్రెస్ చేయి, రైతు గొంతు నొక్కే కబంధ హస్తంగా మారిందన్నారు. రైతు కన్నీరు ఈ ప్రభుత్వాన్ని క్షమించదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు రావుల రాం నాథ్, నల్లా ఇంద్రకరణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం అసమర్థతతో రైతులకు నష్టం

**- ఎమ్మెల్యే సంజయ్ కుమార్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** మొక్కజొన్న కొనుగోళ్లో కేంద్ర ప్రభుత్వం అసమర్థత వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరుగుతుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆరోపించారు. రాయికల్ లో ప్రెస్ క్లబ్ లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మద్దతు ధర ప్రకటించి కేంద్రం చేతులు దులుపుకుంటుందన్నారు. జగిత్యాల అభివృద్ధికి రాజకీయాలతో ముడి పెట్టవద్దన్నారు. విద్యార్థుల చదువులతో రాజకీయ లబ్ధి పొందవద్దని పేర్కొన్నారు. ఎన్నికల వరకే రాజకీయమని, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని అన్నారు. జగిత్యాల మండలం చల్గల్ కేంద్రీయ విద్యాలయానికి స్థలం విషయంలో ఎంపి అరవింద్ ఇరిగేషన్ శాఖ మంత్రితో వారికున్న సత్సంబంధాలతో మాట్లాడవచ్చన్నారు. గతంలో చల్గల్ వాలంతరీ కేంద్రం రైతుల కోసం ఏర్పాటు చేసిందని, చల్గల్ లో ఎంపీ అరవింద్ కి మద్దతుగా ఉన్న రైతులే అక్కడ కేంద్రీయ విద్యాలయం వద్దని నిరసన తెలిపారన్నారు. చల్గల్ లో విద్యా సంస్థల ఏర్పాటుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హనుమండ్లు, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, ప్యాక్స్ చైర్మన్ ధీటి రాజి రెడ్డి, ఏనుగు మల్లారెడ్డి, గనే రాజిరెడ్డి, కోల శ్రీనివాస్ , రవీందర్ రావు, బెజ్జంకి మోహన్, సురేందర్ నాయక్, సింగం రమేష్, గంగాధర్, మర్రిపెల్లి శ్రీనివాస్, తలారి రాజేష్, వేణు, రాజేష్, ఇర్ఫాన్, మురళి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు



**బోథ్, ముద్ర:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ –ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు అన్నారు. గురువారం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ– ఉట్నూర్ పరిధిలోని ఆదిలాబాద్ రూరల్ మండలం బుర్కి, మాంగ్లి గ్రామాలను సందర్శించి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమ, అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. ఆదివాసి గిరిజన ప్రాంతాలలో విద్య, వైద్య సదుపాయాలను మెరుగుపరుస్తూ గిరిజన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలలో సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాలలో వైద్య సదుపాయాలను అందు బాటులో ఉంచే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల ద్వారా వైద్య సేవలు అందించడంతో పాటు, మారుమూల ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

## వచ్చే సంవత్సరం నుంచి విద్యార్థులకు అల్పాహారం



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** వచ్చే విద్యా సంవత్సరం 2026–27 నుంచి రాష్ట్రంలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం కూడా అందించనున్నట్లు డీఈఓ కె. రాము తెలిపారు. జగిత్యాల పట్టణంలోని ఓల్డ్ హై స్కూల్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యతో పాటు సమగ్ర అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చారని, 3 వేల మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని తెలిపారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు 9 వస్తువులతో కూడిన కిట్‌ను విద్యార్థులకు అందజేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో కొత్తగా 78 ప్రీ–ప్రైమరీ పాఠశాలలు, 3 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. ప్రైవేట్ పాఠశాలల్లో వేలాది రూపాయలు ఫీజులు చెల్లించి ఆర్థిక భారం మోసే బదులు, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చంద్రకళ, పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షులు బోయినిపెల్లి ఆనంద్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గురువారం చెక్కులను పంపిణీ చేశారు. నిర్మల్ రూరల్ లో147, నిర్మల్ పట్టణం లో 344 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో పెళ్ళైన ఆడబిడ్డలకు రూ.1 లక్షతో పాటు తులం బంగారం ఇస్తామంటూ ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను అటకెక్కించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇస్తామన్న హామీలను నెరవేర్చాలని ఎక్కడికక్కడ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, నాయకులు జమాల్, పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, కౌన్సిలర్లు గంజి రాజు, శ్రీరామోజీ నరేష్, కూన శశాంక్, సాత్విక్,జింక సూరి, ఖమ్మం సురేందర్, అర్జున్, విఠల్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పంట మార్పిడి చేయాలి



**ముద్ర, కోరుట్ల:** రైతులు పంట మార్పిడి చేయాలని వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. బి. సౌజన్య సూచించారు. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో గురువారం కోరుట్ల మండలం మోహనరావుపేట రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యత గురించి తెలిపారు. యూరియా వాడకాన్ని తగ్గించడం, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ పద్ధతులు పాటించడం, మార్కెట్ లో గిరాకీ ఉన్న వరి రకాలు పండించడంపై అవగాహన కల్పించారు. అలాగే వరిలో పంట అవశేషాలను తగులబెట్టకుండా కలియదున్నాలని ఏఈవో ఫమీనా యాస్మిన్ సూచించారు. ఈ కార్యక్రమం లో మోహనరావు పేట సర్పంచ్ ఎస్. లతిక నరేష్, చిన్న మెట్పల్లి సర్పంచ్ అబ్దుల్ రహీం, అభ్యుదయ రైతులు ఎ.వేణు, బి.సతీష్, రైతులు పాల్గొన్నారు.

## సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం



**ముద్ర, కోరుట్ల:** రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేస్తోందని అడిషనల్ కలెక్టర్ బి.రాజా గౌడ్ అన్నారు. మండలం లోని జోగన్ పల్లి లో ఇంద్రాల నితీష–అశోక్ ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశానికి అడిషనల్ కలెక్టర్ డ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కోరుట్ల తహసీల్దార్ కృష్ణ చైతన్య, జోగన్ పల్లి కార్యదర్శి గీతా రాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొంతం రాజం, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఏలేటి మహిపాల్ రెడ్డి, మండల యూత్ కాం గ్రెస్ అధ్యక్షుడు ఇంద్రాల హరీష్, జోగన్ పల్లి ఉప సర్పంచ్ వేల్పుల అంబేద్కర్, వార్డు సభ్యులు ఏలేటి గోపాల్ రెడ్డి, సైదు గంగాధర్, పైడిమడుగు గ్రామ శాఖ అధ్యక్షుడు మరిపెల్లి జనార్ధన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 15.05.2026
www.mudranews.in | @mudranews



**మాంసంలో మసాలాల నియంత్రణ:**



మాంసం వండేటప్పుడు ఘాటైన మసాలాలు, నూనె వాడకం తగ్గించాలి. ఇవి శరీరంలో వేడిని పెంచి డీహైడ్రేషన్‌కు దారితీస్తాయి.

## రైతు పక్షపాతి ప్రధాని మోడీ



**ముద్ర, తుంగతుర్తి :** ప్రధాని నరేంద్ర మోడీ రైతు పక్షపాతి అని తుంగతుర్తి సర్పంచ్ మల్లెపాక సాయిబాబు అన్నారు. ఆయన ప్రధాని కాక ముందు రూ.1400 గా ఉన్న ధాన్యం మద్దతు ధర రూ. 2441 కు పెరిగిందన్నారు. గురువారం తుంగతుర్తిలో విలేకరులతో మాట్లాడుతూ ధాన్యం మద్దతు ధర పెంచుతూ రూ.2.6 లక్షల కోట్లు కేటాయించడం హర్షించ తగ్గ విషయం అని అన్నారు .వరితో పాటు జొన్న, మొక్కజొన్న, సజ్జలు, రాగులు, పెసలకు మద్దతు ధర పెంచడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ఎరువులపైన వేల కోట్ల రూపాయల సబ్సిడీ ఇస్తుందని అని అన్నారు. ప్రధాని మోడీ తోనే దేశంలో రైతు రాజ్యం సాధ్యమని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో జాప్యానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమన్నారు. కల్లాలలోని వడ్లను వెంటనే కాంటాలు వేసి తరలించాల న్నారు.

## వైభవంగా తిరుప్పావడ సేవ





**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో గురువారం శ్రీ వేంకటేశ్వర స్వామివారికి తిరుప్పావడ సేవ నిర్వహించారు. ప్రతి గురువారం నైవేద్య సమయంలో జరిగే తిరుప్పావడ సేవలో సుమారు 450 కిలోల అన్నప్రసాదాన్ని, లడ్డు, వడ తదితర పిండివంటలను శ్రీవారికి నైవేద్యం చేస్తారు. వేద మంత్రోచ్చారణలతో అర్చించి కర్పూర మంగళ హారతులు సమర్పించారు. అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 3 వేల మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. స్వామివారిని దర్శించుకున్న అఖిల భారత ఉగ్రవాద వ్యతిరేక సంఘం జాతీయ ఛైర్మన్, మాజీ ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మనిందర్‌జీత్ సింగ్ బిట్టా స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంకు ప్రముఖ సామాజిక నాయకుడు, అఖిల భారత జాతీయ ఛైర్మన్, మాజీ ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మనిందర్‌జీత్ సింగ్ బిట్టా ఉగ్రవాద వ్యతిరేక సంఘం జాతీయ ఛైర్మన్, మాజీ ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మనిందర్‌జీత్ సింగ్ బిట్టా విచ్చేసి శ్రీ స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థాన అర్చకులు, అధికారులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికి, వేదాశీర్వచనాలతో సత్కరించారు. అనంతరం ఆయన ఆలయ మహాద్వారం, ప్రధాన గర్భాలయం, ఉప ఆలయాలు, యాగశాల, గోశాల, తీర్థ ప్రదేశాలు తదితర పవిత్ర స్థలాలను సందర్శించి క్షేత్ర వైభవాన్ని ఆస్వాదించారు. అలాగే క్షేత్రంలోని దివ్య జలనారాయణ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకంగా ప్రార్థనలు సమర్పించారు. భూలోక వైకుంఠంగా పేరున్న స్వర్ణగిరి క్షేత్ర నిర్మాణ శైలి, ఆధ్యాత్మిక వాతావరణం, నిత్య కైంకర్యాలు, వైష్ణవ ఆగమ సంప్రదాయ పద్ధతిలో నిర్వహించబడుతున్న సేవలను చూసి ఆయన ఆనందం వ్యక్తం చేశారు. దేశంలో ధార్మిక చైతన్యం, సంస్కృతి పరిరక్షణలో ఇటువంటి దివ్యక్షేత్రాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని అభిప్రాయపడ్డారు.

## ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలి

అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం భువనగిరి మండలం అనంతారం ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి మెగా పీటీమ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యా వారోత్సవాలలో భాగంగా పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను,100 శాతం హాజరు నమోదు చేసిన విద్యార్థులు వారి తల్లిదండ్రులను సన్మానించారు.

**నాగినేనిపల్లిలో..**

బొమ్మలరామారం మండలం నాగినేనిపల్లిలో జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి(మెగా పీటీమ్) విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ పి.మదన్మోహన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అల్పాహారాన్ని అందించడంతో పాటు, ఇంటర్మీడియట్ వరకు ఉచిత మధ్యాహ్న భోజనం అందించనున్నదన్నారు.

**మాసాయిపేటలో..**

యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట ఉన్నత పాఠశాలలోడీఈవో కందుల సత్యనారాయణ పాల్గొని ఉత్తమ ఫలితాలు వస్తున్న ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులను కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెగా పీటీమ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా సెక్టోరియల్ అధికారులు పెసరు లింగారెడ్డి, షేక్ జానీ ఆఫ్షన్, సీ.హెచ్.రాధ, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరం ప్రారంభం



**ముద్ర, యాదగిరిగుట్ట :** ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని సైదాపురం గ్రామ పిహెచ్సిలో టీబీ వ్యాధిపై అవగాహన వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ రోజా దర్శనం ప్రారంభించారు. శిబిరంలో గ్రామస్తులకు ఎక్స్రేలు తీశారు. మరి కొంతమందికి రక్త పరీక్షలు కోసం రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ డి.వెంకట్ రెడ్డి, వార్డు మెంబర్లు, డాక్టర్ పావని, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరీష్ కుమార్. హేమలత టీబీ టీమ్ నాటేష్, మానస, ఏ ఎన్ ఎమ్ లు సుధారాణి, పూలమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఆహార కల్తీని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జిల్లాలో ఆహార కల్తీని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం తన ఛాంబర్ లో ఆహార భద్రతపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధ్యక్షతన జిల్లా ఆహార పరిరక్షణ డెసిగ్నేటెడ్ ఆఫీసర్ పి. స్వాతి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజారోగ్యం, ఆహార నాణ్యత, కల్తీ నివారణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యా సంస్థలు మరియు హాస్టళ్లలో ఆహారాన్ని వండే సిబ్బందికి (ఫుడ్ హేండిలర్స్ ) తక్షణమే ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వంట చేసే వారు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యార్థులకు సురక్షితమైన ఆహారం అందుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేసే గుడ్లు, ఇతర ముడి సరుకుల నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గుడ్ల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడ కూడదని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రస్తుతం ప్రధాన సమస్యగా మారిన పాల కల్తీపై ఆహార భద్రత అధికారులు, పోలీస్ అధికారులతో కలిసి జాయింట్ రైడ్స్ (ఉమ్మడి దాడులు) నిర్వహించి, కల్తీకి పాల్పడే వారిపై కఠినమైన కేసులు నమోదు చేయాలని సూచించారు. చిరు, మీడియం స్కేల్ వ్యాపారులు ఎఫ్ఎస్ఎస్ఐ లైసెన్స్ పొందాలని వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, కూరగా యలు, పండ్ల సాగుకై పెస్టిసైడ్స్ వాడకం తగ్గించాలని తెలిపారు.ఆహార భద్రత నియమిత అధికారి పి. స్వాతి మాట్లాడుతూ జిల్లాలో ఆహార కల్తీని అరికట్టేందుకు తమ బృందం నిరంతరం శ్రమిస్తుందని, నిబంధనలు పాటించని వ్యాపారులపై భారీ జరిమానాలు విధిస్తామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి మనోహర్, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి నరసింహరావు, భువనగిరి రూరల్ సిఐ చంద్రబాబు, పలు శాఖల జిల్లా అధికారులు, సలహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణలో ప్రభుత్వం విఫలం



**ముద్ర, తుంగతుర్తి:** ధాన్యం కొనుగోలు కల్లాల్లో ధాన్యం పోసి నెల రోజులు దాటినా ఇప్పటివరకు పావు వంతు ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించలేదని ధాన్యం సేకరణలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం తుంగతుర్తిలో విలేకరులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీలు సక్రమంగా రాకపోవడం. లోడింగ్ చేసి పంపిన లారీ మిల్లుల వద్ద సకాలంలో దిగుమతులు కాపోవడం వల్ల రైతులకు ఎదురుచూపులు తప్పక ధాన్యం కల్లాల వద్ద పడిగాపులు కాసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. మిల్లు యజమానులు తరుగు పేరుతో తాలు పేరుతో కిలోల కొ ధాన్యం కోతలు పెడుతుండడంతో రైతు పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. గత పదేళ్ల కెసిఆర్ పాలనలో ఎలాంటి ఇబ్బంది పడకుండా రైతులు ధాన్యం అమ్ముకున్నారని రైతు కళ్ళల్లో ఆనందం కనిపించేదని కానీ నేడు రైతు కళ్ళల్లో ఆవేదన కనిపిస్తోందని అన్నారు. కాంగ్రెస్ ను నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచిందని రైతులు నెత్తి నోరు బాదుకుంటున్నారని అన్నారు. విద్యార్థులకు సంబంధించిన నీట్ పరీక్ష పేపర్ లీక్ అవ్వడం వలన 22లక్షల మంది విద్యార్థులు ఈరోజు భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది అని 12 ఏండ్ల కేంద్ర బీజేపీ పాలనలో ఇప్పటికీ నాలుగు సార్లు పేపర్ లీకేజీ వల్ల విద్యార్థులు నష్ట పోతున్న బీజేపీ ప్రభుత్వం నేరస్థుల పై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించలేద న్నారు. ఇందుకు నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని లీకేజీ లో బాధ్యులైన అందరి మీద కఠిన చర్యలు తీసుకోవాలని. నష్ట పోయిన విద్యార్థులకు కేంద్రం తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తుంగతుర్తి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం పార్టీ నాయకులు ఉప్పల నాగమల్లు మాజీ సర్పంచ్ యాకు నాయక్, పూర్ణ నాయక్, రాములు నాయక్, నల్లబెల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

## చెక్ పోస్ట్ ల వద్ద నిరంతర నిఘా

**సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ**



**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** ధాన్యం తరలింపులో రైతులకు పోలీసులు సహకారిగా ఉండాలని, ఇతర శాఖలతో సమన్వయంగా పనిచేయాలని పోలీసు అధికారులకు సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. జిల్లాలో ఐకెపి కేంద్రాల నుండి వరి ధాన్యం ఎగుమతి, మిల్లర్ల వద్ద దిగుమతి, వరి ధాన్యం రవాణా సౌకర్యం, వరి ధాన్యం అక్రమ రవాణా లాంటి అంశాలకు సంబంధించి ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయం నందు పోలీస్ అధికారులతో ఎస్పీ నరసింహ సమావేశం నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు చేశారు. వరి ధాన్యాన్ని తరలించే విషయంలో వాహనాలు సమకూర్చడంలో రైతులకు, కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు సహకరించాలని, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులతో సమన్వయంగా పనిచేయాలని సూచించారు. అకాల వర్షాలకు వరి ధాన్యం తడవకుండా రైతులను అప్రమత్తం చేయాలని కోరారు. జిల్లాలోకి అంతర్ రాష్ట్ర సరిహద్దు నుండి అక్రమంగా వరి ధాన్యం ప్రవేశించకుండా నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. అక్రమ రవాణా నిరోధించడంలో భాగంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ల నందు పోలీస్ సిబ్బంది సమర్థవంతంగా పనిచేసేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఇసుక పిడిఎస్ బియ్యం పశువులు వరి ధాన్యం లాంటి అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్, డిసిఆర్బీ డిఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, డిసిఆర్బీ ఇన్స్పెక్టర్ మగ్దుంఅలీ, ఇన్స్పెక్టర్లు, శివశంకర్, చరమందరాజు, రామకృష్ణారెడ్డి, రాజశేఖర్, ఎస్సైలు ఏడుకొండలు, శివతేజ, నవీన్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

## రమణానంద మహర్షి చేతుల మీదుగా ధ్వజస్తంభ స్థాపన




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ మల్లన్న స్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమాన్ని పరమపూజ్యులు సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి దివ్య సాన్నిధ్యంలో నిర్వహించారు.వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మహర్షి ఆలయ సంప్రదాయాల పరిరక్షణ ప్రతి భక్తుని బాధ్యత అని పేర్కొన్నారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠతో ఆలయానికి మరింత ఆధ్యాత్మిక వైభవం చేకూరుతుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ జక్కా రాఘవేంద్ర రెడ్డి, జక్కా కవిత, వార్డు మెంబర్లు ఎలిమినేటి సురేష్ రెడ్డి, ఎలిమినేటి సునీల, రాములు, దేవేందర్ గౌడ్, ప్రశాంత్ రెడ్డి, కొత్త సత్తయ్య, గుండు అర్జున్, కాసాని శేఖర్ యాదవ్, జక్కా జంగా రెడ్డి గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## సమాజ సేవలో ముందువరుసలో ఆర్యవైశ్యులు

**శ్రీ వాసవి సేవా సమితి జిల్లా నూతన కార్యాలయం ప్రారంభించిన జాతీయ లీగల్ అడ్వైజర్ నేరెళ్ల మాలి యాద్రి**



**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** నిరుపేదల కష్టాలు బాధలు చూసి చదివించే మనసు ఉన్న ఆర్యవైశ్యులు సమాజ సేవలో ముందు వరుసలో ఉన్నారని సుప్రీంకోర్టు అడ్వకేట్, రిటైర్డ్ జడ్జి, శ్రీ వాసవి సేవా సమితి జాతీయ లీగల్ అడ్వైజర్ నేరెళ్ల మాలి యాద్రి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 36 వ వార్డులో శ్రీ వాసవి సేవా సమితి నూతన జిల్లా కార్యాలయాన్ని శ్రీ వాసవి సేవా సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పూరి సురేష్ శెట్టితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. మానవసేవే మాధవసేవ అనే సిద్ధాంతాన్ని నమ్మి ఆచరణలో చూపిస్తున్న కులస్తులు ఆర్యవైశ్యులని ఈ సందర్భంగా గుర్తు చేశారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడంలో ఆర్యవైశ్యుల పాత్ర వెలకట్ట లేనిది అన్నారు . శత్రువులంటూ లేకుండా జీవనం సాగించే ఆర్యవైశ్యులు ఎందరికో ఆదర్శం అన్నారు. అన్ని మతాలను గౌరవిస్తూ తమ మతం కోసం ప్రాణాలు సైతం ఇవ్వడానికి వెనకాడ బోరని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజు దేవాలయాలకు తీసుకువెళ్లాలని దీని ద్వారా భారతీయ సంస్కృతి సంప్రదాయం భవిష్యత్ తరాలకు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు మొక్క నాటుతూ వాటిని సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. కరోనా సమయంలో సమితి ఆధ్వర్యంలో కృష్ణపట్నం సంబంధించిన మందును 30 వేలకు పైగా కుటుంబాలకు అందించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో సుధాకర్ పివిసి మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్, కే శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు ఫరూక్, గౌరవ చైర్మన్ ఈగ దయాకర్ గుప్తా, జిల్లా అధ్యక్షుడు బచ్చు పురుషోత్తం, గౌరవ సలహాదారులు గోపారపు రాజు, ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి నాగరాజు, కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు మిరియాల సుధాకర్, రాచకొండ శ్రీనివాస్ సహాయ కార్యదర్శులు బచ్చు శ్రీనివాస్ ,సోమ సుమన్, తప్సి అనిల్ కుమార్, కోటా శివ, కర్నాటి కృష్ణ , బొల్లం సురేష్ ,సభ్యులు కొండ అనిల్ కుమార్, శ్రీరంగం రాము, సోమ ధనుంజయ్, మనసాని నాగేశ్వరరావు, మిట్టపల్లి రమేష్, బెలిదే శ్రీనివాస్, మంచాల శ్రీనివాస్, చందా రాజశేఖర్, గుడిపాటి రమేష్ వెంపటి శబరినాథ్, తల్లాడ రాము,బుక్క రమేష్, బచ్చు నీరజ, తెడ్ల పల్లవి,ఉప్పలంచు కృష్ణ, మహంకాళి సోమయ్య పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 15.05.2026
www.mudranews.in | @mudranews



**ఎండల వేళ మాంసాహారం వద్దు:**



ఎండలు తీవ్రంగా ఉండే మధ్యాహ్న సమయాల్లో భారీ మాంసాహార భోజనానికి దూరంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు చల్లని వేళల్లో లేదా తక్కువ మొత్తంలో తీసుకోవాలి.

# 1.20 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

**- కలెక్టర్ ప్రతిమాసింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**
జిల్లాలో ఇప్పటి వరకు 27,314 మంది రైతులు నుంచి 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. 13,099 మంది రైతులకు రూ.150.82 కోట్లు వారి అకౌంట్లలో జమ చేసినట్లు వివరించారు. కౌడిపల్లి మండలం మమ్మద్ నగర్ లో శ్రీనివాస ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, లిఫ్టింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద వేగవంతంగా కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎక్కువకాలం కేంద్రాల వద్ద నిల్వ ఉంచకుండా వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం స్టాక్ పెండింగ్‌లో లేకుండా చూడాలని తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 600 లారీల ద్వారా ధాన్యం రవాణా వేగవంతంగా జరిగేందుకు ఆర్టీఓ శాఖ, రవాణా ఏజెన్సీలకు సూచించారు.

కొనుగోలు కేంద్రానికి సమీపంలోనే రైస్ మిల్లులు ఉన్నచో ట్రాక్టర్ల ద్వారా కూడా ధాన్యాన్ని తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, రవాణా, లిఫ్టింగ్ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని తెలిపారు. కలెక్టర్ వెంట నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్, డీఎం జగదీష్, తహసీల్దార్ కృష్ణ తదితర అధికారులు ఉన్నారు.

## దళితులపై దాడికి ప్రయత్నించడం అమానుషం



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** ఆధునిక యుగంలో సైతం దళితులను కులం పేరుతో దూషిస్తూ దాడికి ప్రయత్నించడం అమానుషమని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట్ భూంపల్లి మండలం పోతా రెడ్డి గ్రామంలో దళితులను కులం పేరుతో దూషించి దాడికి ప్రయత్నించిన సంఘటనపై గురువారం బాధితులను, గ్రామస్తులను కలిసి సంఘటన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి చెందిన దళితులైన యాదగిరి, బాలరాజ్ , కుమ్మరి సత్తయ్య లు న స్కల్ పాత రోడ్ లో తమ ఎడ్లబండలో ఇసుకను తెచ్చుకుంటున్న సందర్భంలో గ్రామానికి చెందిన బండి మురళి గౌడ్, నర్సాగౌడ్ లు అడ్డుకొని మీ ఎడ్ల బండ్లు ఈ రోడ్డు నుండి పోవద్దని జాతి పేరుతో అసభ్యకరంగా దూషిస్తూ దాడికి పాల్పడ్డారన్నారు. సమాజం అభివృద్ధి వైపు పోతున్నప్పటికీ దళితుల పట్ల కుల వివక్ష అంటరానితనం, అణిచివేత పాల్పడడం మారడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులను కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. గ్రామంలో తహసీల్దార్, ఎస్సై నెల చివరన పౌర హక్కుల దినోత్సవం నిర్వహించి కుల వివక్ష, ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం పై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుబాయ్ సంజు, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు భీమ్ శేఖర్, గ్రామ నాయకులు చంద్రసాగర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మంజీరిక ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



**ముద్ర ప్రతినిధి, మెదక్:**
స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని తెలుగు విభాగం ఆధ్వర్యంలో మంజీరిక ప్రత్యేక సాహిత్య సంచికను ప్రిన్సిపాల్ డా. హుస్సేన్ ఆవిష్కరించారు. సంపాదక మండలిని ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ సందర్భంగా తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ వామన మూర్తి మాట్లాడుతూ కళాశాల ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థుల చేత రచించిన సృజనాత్మకమైన కవితలను, కథలను కలిపి సంచికను వెలువరించడం సంతోషం కలిగించిందన్నారు. సృజనాత్మక రంగంలో విద్యార్థులను ప్రోత్సహించుటలో తెలుగు శాఖ ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. ఈ ప్రత్యేక సంచికను డాక్టర్ వామనమూర్తి, డాక్టర్ ప్రవీణ్ కుమార్, వేణుగోపాల శర్మ సంపాదకీయంలో వెలువరించినట్టు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ సింహా రెడ్డి, ఐక్యుఎసి కోఆర్డినేటర్ తిరుమలరెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ శరత్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు

**- నీట్ పేపర్లను అమ్ముకుంటున్న మోదీ ప్రభుత్వం**

**- కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**
మోదీ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం తగదని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. గురువారం సిద్దిపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడో సారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం మూడు సంవత్సరాల్లో నీట్ పరీక్ష పత్రాలను లీక్ చేసిందన్నారు. విద్యార్థుల పరీక్ష పత్రాలు లీకులు చేసి బడా కంపెనీలకు దోచి పెడుతున్నదని మండిపడ్డారు. నిరుద్యోగులకు ప్రతి సంవత్సరం లక్ష ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మూడో సారి అధికారంలోకి వచ్చిన ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిస్తున్నదన్నారు. గడిచిన పది సంవత్సరాలలో ఎన్నో సార్లు నీట్ పేపర్లను అమ్ముకుంటున్న మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన నీట్ లీకుల నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నీట్ లీకుల నిందితులతో పాటు కేంద్ర ప్రభుత్వంను కూడా ఎఫ్ఐఆర్ లో చేర్చాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్వహించిన పలు పరీక్ష పత్రా లలో పేపర్ లీకేజీకి పాల్పడ్డారని, ఉద్యోగాలను కూడా అమ్ముకున్నారన్నారు. నీట్ పరీక్ష రద్దుతో విద్యార్థుల జీవితాలను కేంద్ర ప్రభుత్వం అంధకారంలోకి నెట్టిందన్నారు. విద్యార్థులు నిరుద్యోగుల పట్ల బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చిత్త శుద్ధి లేదన్నారు. హిందుత్వం పేరుతో అరాచకాలకు పాల్పడుతున్న మోదీ ప్రభుత్వం దేశంలోని అన్ని వర్గాల వారికి అన్యాయం చేసిందన్నారు. ప్రధాన మంత్రి అయిన నాటి నుండి అదానీ అంబానీలకు దోచి పెడుతూ కోట్ల రూపాయలు మోడీ దోచుకుంటున్నారన్నారు. దేశ భవిష్యత్తు, అన్ని వర్గాల వారికి న్యాయం జరగాలంటే కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లోనే దేశంలోని అన్ని వర్గాలకు న్యాయం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్యాదారి మధు, గాయాజుద్దీన్, హర్షద్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు, రవాణా ఆలస్యం కావొద్దు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ధాన్యం కొనుగోలు, రవాణా ఆలస్యం కావద్దని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. పూర్తయ్యేవరకు అధికారులు క్షేత్ర స్థాయిలోనే ఉండాలని ఆదేశించారు. రామాయంపేట మండలంలోని లక్ష్మాపూర్, కాట్రియాలలో కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన అన్నీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం కావాలని, ప్రతీ అధికారి కేంద్రాలని సందర్శించి కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చింది, ఎంత తూకం వేశారు, ఎంత మంది హమాలీలు ఉన్నారు, సరిపడా గన్ని బ్యాగ్ లు, టార్పాలీన్ లు ఉన్నాయా, లారీలు వచ్చాయా లేదా, లోడింగ్ కి ఎంత టైం తీసుకుంటున్నారు, ట్యాబ్ ఎంట్రీ ఎలా చేస్తున్నారు అని వివరాలను కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. తేమ శాతం రాగానే ఎలాంటి ఆలస్యం లేకుండా కొనుగోలు అవ్వాలని, సరిపడా హమాలీలను పెట్టుకొని కొనుగోలు అయిన ధాన్యాన్ని ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలన్నారు. మిల్ కి వెళ్లే ట్రక్ లో కేంద్రానికి సంబంధించిన ఒకరిని కూడా పంపించి, అక్కడ ధాన్యం త్వరగా అన్ లోడ్ అయ్యేలా చూసుకోవాలన్నారు.

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా వార్తలు..**

## పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తాం



**ముద్ర, హైదరాబాద్:**
పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. గురువారం కామారెడ్డి జి నిజాంసాగర్ మండలం అచ్చంపేట గ్రామపంచాయతీ పరిధిలోని లింగంపల్లిలో డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్‌తో కలిసి ఇందిరమ్మ ఇంటిని గురువారం ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదల కోసం నిరంతరం పనిచేస్తుంద న్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సమాజంలోని పేదల అభ్యుదయమే ముందుకు సాగుతున్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పండరి, గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

**- కలెక్టర్ సత్యప్రసాద్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సత్యప్రసాద్ హెచ్చరించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల సేకరణ, నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలనే ఉదేశ్యంతో కలెక్టర్ గురువారం జిల్లాలోని పలు రైస్ మిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఆర్డీవో నరసింహ రావు, సివిల్ సప్లైస్ డీఎం జితేంద్ర ప్రసాద్, తహసీల్దార్ పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్య




**ముద్ర ప్రతినిధి, మెదక్:** నిరుపేదలైన గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. ప్రభుత్వ లక్షాన్ని అందరు సద్వినియోగం చేసుకొని మంచి విద్యా బుద్ధులతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. గురువారం గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశాల కోసం లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంలో విధ్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో పూర్తి స్థాయిలో ఉచితంగా విద్యను భోదించడంతో పాటు వారికి అవసరమైన భోజన, వసతి సౌకర్యాలను కూడా పూర్తిగా ఉచితంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి వి .నీలిమ, గిరిజన వసతి గృహ అధికారులు డి. లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# స్వార్థ రాజకీయాలు చేయొద్దు

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
ఇప్పటికైనా స్వార్థ రాజకీయాలు చేయడం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మానుకోవాలని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జీ డా.భోగ శ్రావణి సూచించారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తాము నిజాలు చెప్పినప్పటికీ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పొంతన లేకుండా మాట్లాడుతున్నారని మర్శించారు. పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్, అర్బన్ మండల అధ్యక్షుడు రాం రెడ్డి, మహిళ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పిండేరు భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.




## జనగణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

**ముద్ర, హైదరాబాద్:** జనగణన సర్వే ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. కామారెడ్డి జిల్లాలోని రాజంపేట మండలంలో నిర్వహిస్తున్న జనగణన ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఇంటింటి సర్వే నిర్వహణ, వివరాల నమోదు, డేటా సేకరణ ప్రక్రియల గురించి సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com